ప్రజాశక్తి

ఆదివారం 15 సెప్టెంబర్ 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

రబీపైనే ఆశలు

- నీరు తొలగిన తరువాత సాగుకు సమాయత్తం
- అపరాలు, జొన్న, మొక్కజొన్నకు అవకాశం



ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లాలో కురిసిన అతి భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్న ప్రాంతాల్లో రబీ సాగు వైపు రైతులు దృష్టి సారించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గుంటూరు, పల్నాడు జిల్లాలో రబీలో అపరాల సాగు గణనీయంగా పెరగనుంది. ప్రధానంగా మినుము, పెసర, శనగ పంటల విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. ప్రధానంగా ఖరీఫ్‌లో దెబ్బతిన్న పంటల స్థానంలో 15 రోజుల తర్వాత రబీ పంటలు వేస్తారని భావిస్తున్నారు. గుంటూరు జిల్లాలో రబీ విస్తీర్ణం 1.80 లక్షల ఎకరాల వరకు ఉంటుందని అంచనా కాగా ఈ ఏడాది కొంత పెరిగే అవకాశంఉంది. దాదాపు 83 వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతినడం వల్ల తక్షణం రబీ ▶ 2లో

2వ పేజీలో వార్తలు..

స్టాఫ్ నర్సులు, ఎఎన్ఎంల మధ్య చిచ్చుపెట్టే జీవో 115

రద్దు కోసం ఆస్పత్రి ఎదుట నర్సుల నిరసన



మాచర్లకు అంధుల క్రికెట్ కెప్టెన్

సత్కరించిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి

బాలిక కిడ్నాప్ కేసులో ఒకరు అరెస్టు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

బాలిక కిడ్నాప్ కేసులో నిందితుణ్ణి మంగళగిరి రూరల్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఈ మేరకు వివరాలను రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకట్ వెల్లడించారు. పెదకాకాని మండలం నంబూరుకు చెందిన గాడిదపాటి రాజు అనే వ్యక్తి అపార్ట్మెంట్లకు వాచ్మెన్‌గా పని చేస్తుంటాడు. తన 13 ఏళ్ల కుమార్తెను నంబూరులో 5వ తరగతి చదువుతోంది. రాజు ఆత్మకూరులో ఒక అపార్ట్మెంట్‌కు వాచ్మెన్‌గా పనిచేస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన తాటి రూపేంద్రప్రభు బాలికను ప్రేమ పేరుతో వెంబడించి ఇబ్బంది పెడుతుండగా రాజు మందలించాడు. ఈ క్రమంలో రెండ్రోజుల కిందట ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి బాలికను రూపేంద్ర ప్రభు తన ద్విచక్ర వాహనంపై బలవంతంగా ఎక్కించుకుని కిడ్నాప్ చేశాడు. బాలిక తండ్రి రాజు ఫిర్యాదులో కేసు నమోదు చేసిన పోలీసులు 24 గంటల్లోనే నిందితుణ్ణి అరెస్టు చేశారు. నిందితునిపై గంజాయి, మద్యం కేసులున్నాయని పోలీసులు తెలిపారు. నిందితుణ్ణి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.



వర్సిటీ అధ్యాపకులు డాక్టర్ వసంతరావుకు బెస్ట్ టీచర్ ఎడ్యుకేటర్ అవార్డు

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆంధ్రప్రదేశ్ ఎంఇడి అసోసియేషన్ 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి బెస్ట్ టీచర్ ఎడ్యుకేటర్ అవార్డుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని విద్యా విభాగం గెస్ట్ ఫ్యాకల్టీగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎం.వసంతరావును ఎంపిక చేశారు. ఈ అవార్డుకు 130 మంది అధ్యాపకులు దరఖాస్తులు చేసుకోగా డాక్టర్ వసంతరావును ఎంపిక చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రమేష్ వెల్లడించారు. ఈ మేరకు శనివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అవార్డును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దయానందరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ విద్యా విభాగం డీన్ స్వరూపారాణి, ఆంధ్రకేసరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ బి.హరిబాబు పాల్గొన్నారు.

రబీపైనే ఆశలు

(మొదటి పేజీ తరువాయి)

సాగు కింద మినుము, పెసర, శనగ, జొన్న, మొక్కజొన్న సాగుకు అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. గతేడాది వర్షాలు సరిగా లేక, కాల్వలకు నీరు రాక రబీ సాగు తక్కువగా సాగింది.

రబీలో గుంటూరు జిల్లాలో 1.80 లక్షల ఎకరాల్లో పంటలను సాగు చేయాల్సి ఉండగా కేవలం 42 వేల ఎకరాల్లోనే పంటలు వేశారు. పల్నాడు జిల్లాలో 1.42 లక్షల ఎకరాల్లో సాగు.జరగాల్సి ఉండగా ఇప్పటి వరకు 70 వేల ఎకరాల్లోనే రబీ పంటలు వేశారు. పల్నాడు జిల్లాలో కంది విస్తీర్ణంమాత్రం స్వల్పంగా పెరిగింది. సాధారణ విస్తీర్ణం 4500 ఎకరాలు కాగా ఈ ఏడాది 8500 ఎకరాల్లో కంది సాగు చేశారు. రబీలో సాగుచేసిన శనగ డిసెంబరులో వచ్చిన మిచైన్ తుపానుకు తుడిచిపెట్టుకు పోయింది. దీంతో తక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన మినుము, పెసర, శనగ పంటలకు నష్టం జరిగింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది అడ్వాన్సు రబీ సాగుకు అవకాశాలు మెరుగుపడ్డాయని చెబుతున్నారు. కృష్ణా డెల్టాలో వరి సాగుకు సమయం దాదాపుగా పూర్తి కావచ్చింది. గరిష్టంగా ఈనెల 20వ తేదీ లోగా వరినాట్లు పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటికీ మునిగిన పొలాల్లో నీరు కొనసాగుతోంది. నీరు తొలగిన తరువాత పొలాలను మళ్లీ సేద్యానికి సిద్ధం చేయాలన్నా ఇంకా 10 రోజుల సమయం పడుతుంది. అందువల్ల అనివార్యంగా అపరాలతో పాటు జొన్న, మొక్కజొన్న సాగు తప్పని సరి అంటున్నారు.

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో అధిక వర్షాల వల్ల దాదాపు 10 పాటు పొలాల్లో నీరు నిలిచిపోవడం, ఖరీఫ్ పంటలు దెబ్బతినడం, వాటిని తొలగించిన తరువాత భూమిలో ఉన్న తేమ వల్ల జొన్న, మొక్కజొన్న సాగు చేసేందుకు అవకాశం ఉన్నా గతేడాది సరైన ధరలు లేకపోవడంతో రైతులు నిరాశతో ఉన్నారు. ప్రధానంగా గుంటూరు జిల్లాలో వరి సాగు చేసిన 3 లక్షల ఎకారాల్లో దాదాపు లక్ష ఎకరాల్లో వివిధ రకాల పంటలకు నష్టం జరిగింది. దీంతో ప్రత్యామ్నాయంగా రబీ సాగుకు వెళ్లక తప్పదంటున్నారు. ఇందుకు పెట్టుబడులు కూడా తక్కువ అవుతాయంటున్నారు. గుంటూరు జిల్లాలో 51 వేల ఎకరాలు జొన్న సాగు చేస్తారని అంచనా కాగా మరో 50 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగయ్యే అవకాశాలు ఉన్నాయి. శనగ విస్తీర్ణం కూడా పెరిగే అవకాశం ఉంది. పల్నాడు జిల్లాలో వరి సాగు ఇప్పుడిప్పుడే ఊపందుకుంది. 1.30 లక్షల ఎకరాల్లో వరిసాగు జరుగుతుందని అంచనా కాగా ఇప్పటి వరకు కేవలం 50 వేల ఎకరాల్లో వేశారు. మరో 50 వేల ఎకరాల్లో ఈనెలాఖరులోగా సాగు చేస్తారని అంచనా.

గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : గూడ్స్ రైలు కింద పడి గుంటూరుకు చెందిన వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సత్తెనపల్లి రైల్వేస్టేషన్‌లో శనివా రం రాత్రి జరిగింది. తొలుత వృద్ధుడు మాచర్ల నుండి గుంటూరు వెళు తున్న రైలు కింద పడపోగా ప్రయాణికులు కేకులు వేయటంతో పక్కకు వచ్చాడు. తర్వాత పిడుగురాళ్ల నుండి గుంటూరు వెళుతున్న గూడ్స్ రైలు కింద పడి ఆత్మహ త్య చేసుకున్నాడు. గుంటూరు కొరిటపాడులో బడ్డి కొట్టు నిర్వహిస్తున్న సంకా నాగేశ్వరరావు (60)గా రైల్వే పోలీసులు గుర్తించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.



నరసరావుపేటలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు



పిడుగురాళ్లలో పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

యుటిఎఫ్ క్రీడా పోటీల్లో ఉత్సాహంగా ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) స్వర్ణోత్సవాల్లో భాగంగా యుటిఎఫ్ నరసరావుపేట ప్రాంతీయ శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు శనివారం ఆటల పోటీలు నిర్వహించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణం పల్నాడు రోడ్డులోని మున్సిపల్ బాలుర పాఠశాలలో పోటీలను యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్ ప్రారంభించారు. షాట్‌పుట్, పరుగు పందెం, క్యారమ్స్, చెస్ పోటీలు నిర్వహించగా రొంపిచర్ల, నరసరావుపేట మండలం, నరసరావుపేట పట్టణం, నకిరికల్లు మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా యుటిఎఫ్ పల్నాడు జిల్లా సహాధ్యక్షులు ఎం.మోహనరావు, మహిళా సహధ్యక్షులు ఎ.భాగేశ్వరిదేవి, జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిలర్ ఎన్.సుందరరావు వ్యవహరించారు.

షాట్ పుట్ మహిళల విభాగంలో బాజీ బి, రోజారాణి, నాగరత్నం మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. పురుషుల విభాగంలో టి.వెంకటేశ్వర్లు, బి.శ్రీనివాస్ కళ్యాణ్, కె.సుందరరాజు మొదటి మూడు స్థానాలను సాధజంచారు. పరుగుపందెం మహిళా విభాగంలో రోజారాణి, కార్మెల్ మేరీ, ఎం.జ్యోతి, కె.రాఘవమ్మ, విజేతలుగా నిలవగా, పురుషుల విభాగంలో బి.శ్రీనివాస్ కళ్యాణ్, ఎం.రామాంజనేయులు, టి.వెంకటేశ్వర్లు గెలుపొందారు. క్యారమ్స్‌లో ఉపాధ్యాయినులు ఎన్.జ్యోతి, నాగరత్నం, బాజీబి, వి.లక్ష్మీనరసమ్మ, చెస్‌లో కె.ఉషాశౌరిరాణి, డి.రోజారాణి ప్రతిభ చాటారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

గురజాల నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జెడ్‌పి పాఠశాలలో నిర్వహించగా ముఖ్యఅతిథిగా స్థానిక వైద్యులు ఉన్నం నాగమల్లికార్జునరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు పాండురంగ శ్రీనివాసరావు హాజరై ప్రారంభించారు. యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రేమ్‌కుమార్, విజయ సారథి మాట్లాడుతూ పోటీలు మూడ్రోజుల పాటు ఉంటాయని చెప్పారు. మొదటి రోజు పిడుగురాళ్లలో వాలీబాల్, క్యారమ్స్, చెస్ పోటీలు జరుగుతాయని, రెండో రోజు గురజాలలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు, మూడోరోజు పిడుగురాళ్లలో షాట్‌పుట్, రన్నింగ్, బ్రిక్స్ వాకింగ్, టగ్ ఆఫ్ వార్, క్రికెట్ తదితర పోటీలు ఉంటాయని వివరించారు. శనివారం నిర్వహించిన వాలీబాల్‌లో కారంపూడికి చెందిన జట్టు విజయం సాధించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వి.నాగేశ్వరరావు, జెవిడి నాయక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు షేక్ ఖాసింపీరా, ఆడిట్ కమిటీ కన్వీనర్ షేక్ జమాల్, సీనియర్ నాయకులు అరుణ్ కుమార్, సాయిబాబా, శ్రీనివాసరావు, సాంబశివరావు పాల్గొన్నారు.



గుంటూరులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి స్రవంతి



పొన్నూరులో నిర్వహిస్తున్న న్యాయమూర్తి అంజనీ ప్రియదర్శిని

లోక్ అదాలత్‌లో 2,759 కేసుల పరిష్కారం

ప్రజాశక్తి - గుంటూరు లీగల్

జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ వైవిఎస్‌బిజి పార్థసారథి ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ కోర్టుల్లోనూ లోక్ అదాలత్ నిర్వహించగా కడపటి సమాచారం అందే సరికి మొత్తంగా 2,759 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిల్లో సివిల్ కేసులు 258, క్రిమినల్ కేసులు 1898, చెక్‌బౌన్స్ కేసులు 194, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు 150, కార్మిక వివాద కేసులు 7, వివాహ సంబంధ కేసులు 64, బ్యాంకు కేసులు 56, ప్రీ -లిటిగేషన్ కేసులు 129 ఉన్నాయి. కేసుల పరిష్కారం ద్వారా కక్షిదారులకు రూ. 47 కోట్ల 13 లక్షల 11 వేల 302 లబ్ధి చేకూరినట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రజాశక్తి - పొన్నూరు

స్థానిక ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) న్యాయమూర్తి ఎం. అంజనీ ప్రియదర్శిని ఆధ్వర్యంలో స్థానిక కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. 11 సివిల్ కేసులు, 55 క్రిమినల్ కేసులు, 16 ఎస్టిసిలు, మొత్తం 89 కేసులు పరిష్కారం అయ్యాయి. కక్షిదారులకు రూ.21 లక్షల 65 వేల 329 లబ్ధిపొందారు. లోక్ అదాలత్ సభ్యులు మక్బూల్ బేగ్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.జయరాజ్, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సులు, ఎఎన్ఎంల మధ్య చిచ్చుపెట్టే జీవో 115

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పొమ్మనలేక పొగ పెట్టినట్లు రాష్ట్ర ప్రభుత్వ వైద్యారోగ్య శాఖ తాజాగా జారీ చేసిన జీఓ 115 కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు, ఎఎన్ఎంల మధ్య చిచ్చురేపుతోందని స్టాఫ్ నర్సులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని ఏరియా ఆస్పత్రి ఎదుట శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా స్టాఫ్ నర్సు డి.నగరాజకుమారి మాట్లాడుతూ మూడేళు కూడా చదవని ఎఎన్ఎంలకు ఏడాదిన్నరలో జిఎన్ఎంలుగా శిక్షణ అందించి స్టాఫ్ నర్సులుగా నియమిస్తే ఆరేళ్ల పాటు చదువుకున్న తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఏళ్ల తరబడి గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసిన తమకు గత ప్రభుత్వం జిఎన్ఎంలుగా శిక్షణిచ్చి ప్రమోషన్లు కల్పించిందని, తమకు శిక్షణ ఇస్తున్నప్పుడు



లేని అభ్యంతరం పోస్టింగ్స్ సమయంలో ఎందుకని ప్రశ్నించారు. మరోవైపు జీవో 115కు సంబంధించి విధివిధానాలు నేటికీ ఖరారు కాకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జీవో 115ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో స్టాఫ్ నర్సులు అరుణ, ఆదిలక్ష్మి, జి.మాణిక్యం, కీర్తన, సునీత పాల్గొన్నారు.



స్నేహితుడు వేముల శ్రీనివాసరావుతో అజయ్ కుమార్ రెడ్డి

మాచర్లకు అంధుల క్రికెట్ కెప్టెన్

సత్కరించిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి- మాచర్ల : భారతదేశ అంధుల (బ్లైండ్) క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, అర్జున అవార్డు గ్రహీత ఇల్లూరి అజయ్ కుమార్‌రెడ్డి శనివారం తన సొంతూరైన మాచర్లకు వచ్చారు. తన మిత్రులు విఎన్‌ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు వేముల శ్రీనివాసరావు కలిసి వారు తమ సంస్థ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. 7వ తరగతి విద్యార్థి క్రికెట్ పట్ల మక్కువ ఉన్న వేముల సంతోష్ బ్యాట్‌పై సంతకం చేసి క్రికెట్‌లో బాగా రాణించాలని ఆశీర్వదించారు. క్రీడల్లో రాణించాలంటే చిన్ననాటి నుండి పట్టుదలతో తాము ఎంచుకున్న క్రీడపై పట్టు సాధించాలని చెప్పారు. ఇదిలా ఉండగా అజయ్ కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి సత్కరించారు. అజయ్‌కుమార్‌రెడ్డి 2016 నుండి 2024 వరకు భారత బ్లైండ్ క్రికెట్ కెప్టెన్‌గా ఉన్నారు. ఈయన హయాంలో భారత జట్టు వరుసగా 5 ప్రపంచ క్రికెట్ కప్‌లు సాధించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యున్నత అర్జున అవార్డు మాచర్లకు చెందిన అజయ్ కుమార్‌రెడ్డికి రావటం ఎంతో గర్వకారణమని, ఈయన్ను స్ఫూర్తిగా తీసుకొని యువత క్రీడల్లో రాణించాలని అన్నారు.

వర్సిటీని సందర్శించిన తెలంగాణ అధ్యాపకులు

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఫారెస్ట్రీ విభాగాన్ని తెలంగాణలోని ములుగులో ఉన్న ఫారెస్ట్ కళాశాల అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ అధ్యాపకులు సందర్శించారు. శుక్ర, శనివారాల్లో వర్సిటీలో పర్యటించిన అధ్యాపకులు ఫారెస్ట్రీ విద్యార్థులకు పలు అంశాల మీద మెలకువలు తెలియజేశారు. వుడ్ టెక్నాలజీ, ట్రీ ఇంప్రూవ్ మెంట్ (సిల్వికల్చర్), ఫారెస్ట్ మేనేజ్మెంట్ అంశాల మీద విద్యార్థులకు లెక్చర్స్ ఇచ్చారు. ఫారెస్ట్రీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఏయే విభాగాల్లో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు ఉంటాయో వివరించారు.

డ్రెయిన్‌లపై ఆక్రమణలను తొలగిస్తాం : కమిషనర్

అనధికారిక నిర్మాణాలను అనుమతించం

పారిశుధ్యం నిర్వహణకు ప్రాధాన్యం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో మురుగునీటి పారుదల సమస్యలు రాకుండా కాల్వలు,డ్రైన్లపై ఉన్న అన్ని ఆక్రమణలు తొలగిస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గుంటూరులోని తన కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విజయవాడలో వరదలు వల్ల ఉత్పన్నం అయిన పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని మురుగు పారుదలకు అడ్డుగా ఉన్న డ్రైన్లపై ఆక్రమణలను సమగ్రంగా తొలగిస్తామని తెలిపారు. వర్షం నీరు డ్రైన్ల లోకి వెళ్ళడానికి డ్రైన్ల పై ఆక్రమణలు పెరగడం ప్రధాన కారణం కాగా బుడ మేరుకు గండి పడటం మరో కారణమన్నారు. విజయవాడలో ఆక్రమణల వలన మేజర్ డ్రైన్లు బ్లాక్ అయ్యి, అంతర్గత డ్రైన్లు, రోడ్ల మీద నీరు వెళ్లడానికి వీలులేక ఇళ్ళల్లోకి చేరి ప్రజా జీవనాన్ని అతలాకుతలం చెసిందన్నారు. విజయవాడ వరద బాదిత ప్రాంతాల్లో జీఎంసి ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులు, కార్మికులు విశేష కృషి చేశారన్నారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం ,రాత్రికి



భోజనం ప్రతి రోజు షుమారు లక్ష ప్యాకెట్స్ అందించామన్నారు. బిస్కెట్స్, పాలు, బ్రెడ్ కూడా అందించి అండగా నిలిచామన్నారు. విజయవాడ వరద అనుభావాన్ని దష్టిలో ఉంచుకొని గుంటూరు నగరంలో కూడా ప్రధాన డ్రైన్ల పై ఆక్రమణల తొలగింపు ప్రారంభించామన్నారు. డ్రైన్ల పై ఆక్రమణల వలన పూడికతీత జరగలేదని, ఫలితంగా చిన్నపాటి వర్షాలకు కూడా నీరు రోడ్ల మీద, చుట్టూ పక్కల నివాసాల్లోకి చేరుతుందన్నారు. రాబోవు 10 రోజుల్లో డ్రైన్ల మీద ఆక్రమణలను వారే స్వచ్చందంగా తొలగించుకోవాలని, లేకుంటే జెసిబిల ద్వారా నగరపాలక సంస్థ సిబ్బంది తొలగిస్తారని స్పష్టం చేశారు. ఇప్పటికే క్షేత్ర స్థాయి పర్యటనలో నగరంలోని ఓల్డ్ క్లబ్ రోడ్ డ్రైన్ ను పరిశీలిస్తే పూడిక, వ్యర్ధాలతో ఉండి, ఆక్రమణలతో అత్యంత దారుణంగా ఉందన్నారు. డ్రైన్ల ఆక్రమణల పై ఉపేక్షించే పరిస్థితి లేదన్నారు. గుంటూరు నగర ప్రజారోగ్య కార్మికులు, చెత్త తరలింపు వాహనాలు విజయవాడకు సహాయ చర్యల కోసం వెళ్లడం వలన కొంత పారిశుధ్య సమస్యలు తలెత్తాయని, రానున్న 3 రోజుల్లో అదనపు కార్మికులు, యంత్రాల ద్వారా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. జీఎంసి పరిధిలో డ్రైన్ల మీద, రోడ్ పుట్ పాత్ ల పై అనధికార వీధి వ్యాపారాల వలన ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయని, అతి త్వరలో వీధి వ్యాపారుల సంక్షేమాన్ని కూడా దష్టిలో ఉంచుకొని రెడ్, గ్రీన్, అంబర్ స్ట్రీట్ వెండింగ్ జోన్ల ఏర్పాటుకు అధికారులు, వివిధ సంస్థల భాగస్వామ్యంతో కమిటి ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.



పలు ప్రాంతాల్లో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో వర్షం నీరు డ్రైన్లలోకి మాత్రమే వెళ్లే విధంగా, డ్రైన్ల మీద ఆక్రమణల తొలగింపు ప్రారంభించామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం కమిషనర్ కొత్తపేట ఓల్డ్‌క్లబ్ రోడ్, రైలు పేట, పొత్తూరి వారి తోట, గుంటూరువారి తోట ప్రాంతాల్లో పర్యటించి, డ్రైన్ల ఆక్రమణలు గమనించి, తొలగింపు పనులపై క్షేత్ర స్థాయి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రైన్లపై ఆక్రమణల వలన ఇటీవల కురిసిన వర్షాలకు పలు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీరు వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఓల్డ్‌క్లబ్ రోడ్‌లో డ్రైన్‌పై పూర్తిగా ఆక్రమణలు జరిగి, మురుగుపారుదలకు వీలు లేకుండా ఉందన్నారు. పూడిక తీయడానికి కూడా వీలు లేకుండా ర్యాంప్‌లు, ఆక్రమణలు ఉన్నాయని, తక్షణం వాటిని జెసిబిలతో తొలగించాలని అధికారుల్ని ఆదేశించారు. ఈ పర్యటనలో తూర్పు ఎంహెచ్‌ఓ (ఇంచార్జి) రామారావు, డిఈఈ రాము, ఎస్‌ఎస్ ఆయుబ్ ఖాన్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పర్వతారోహకులు అన్నపూర్ణకు రూ.35 వేల ప్రోత్సాహక బహుమతి

ప్రజాశక్తి - విజయవాడ



అన్నపూర్ణకు ప్రోత్సాహక బహుమతిని అందిస్తున్న పి.మురళీకృష్ణ తదితరులు

రష్యాలో 5.6 కిలోమీటర్ల ఎత్తైన ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించి జాతీయ పతాకాన్ని ఎగురవేసిన తాడేపల్లికి చెందిన బండారు అన్నపూర్ణకు విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె) ఆధ్వర్యాన 25 వేల రూపాయల ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. అలాగే వన్ ఎర్త్ -వన్ లైఫ్ టెర్రస్ గార్డెన్ గ్రూపు తరపున రూ.10 వేల బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంబివికె ట్రస్ట్ కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ, ఇన్చార్జి బి.ఆర్.తులసీరావు, బాధ్యులు కె.స్వరూపరాణి, పి.విజయ, టి.క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు

విజిలెన్సుకు ఫిర్యాదు చేస్తాం : ఎమ్మెల్యే నరేంద్ర

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు భజరంగ్ జూట్ మిల్లు స్థలంలో నిర్మిస్తున్న గ్రీన్ గ్రేస్ బహుళ అంతస్తుల సముదాయాలకు ఎటువంటి అనుమతి లేదని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తున్నారని పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర ఆరోపించారు. గుంటూరులోని తన కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పోన్నూరు వైసిపి అభ్యర్ధిగా పోటీ చేసిన అంబటి మురళీ ఆధ్వర్యంలో ఈ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. 2015లో రెండు సెల్లార్‌లు, ఐదు ఫ్లోర్‌ల కోసం అనుమతి తీసుకున్నారని, 2017లో 15 ఫ్లోర్‌ల కోసం అనుమతి అడిగారని, ఇంత వరకు అనుమతి రాలేదని తెలిపారు. రైల్వే ట్రాక్‌కు సమీపంలో నిర్మాణాలు చేస్తున్నా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రైల్వే ట్రాక్ నుంచి 75 అడుగుల దూరంలో నిర్మాణాలు ఉండాలని నిబంధనతో రైల్వే శాఖ ఎన్ ఓసి ఇచ్చిం దన్నారు. కానీ అందుకు భిన్నంగా 35 అడుగుల దూరంలోనే నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. సరైన అనుమతులు లేకుండా ప్రభుత్వానికి, కార్పొరేషన్‌ను మోసం చేస్తుంటే అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అగ్నిమాపక, పర్యావరణ, ఎయిర్ ట్రాఫిక్ విభాగంల నుంచి ఎటువంటి ఎన్‌వోసిలు పొందలేదన్నారు. మైనింగ్, కార్మిక శాఖలకు సెస్సులు, బీమా చెల్లింపులు చేయలేదన్నారు. నిబంధనలు ఉల్లంఘన, అధికారుల అవినీతిపై విజిలెన్సుకు ఫిర్యాదులు చేయనున్నట్టు తెలిపారు. దాదాపు 500 మంది వినియోగదారులను కూడా మోసం చేశారని అన్నారు. ఒక ప్లాన్ ఇచ్చి మరో ప్లాన్ ప్రకారం నిర్మాణాలు చేపడుతున్నారని అన్నారు. నిర్మాణాలు ఆపి వినియోగదారులకు న్యాయం చేయాలని కోరారు.

అనుమతులు ఉన్నాయి : అంబటి మురళి

తమ నిర్మాణాలకు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని, నిబంధనల మేరకు నిర్మాణాలు జరుగుతున్నాయని కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని పుకార్లను నమ్మవద్దని వైసిపి నాయకులు అంబటి మురళీ తెలిపారు. తొలుత 2017, తరువాత రివైజ్డ్ అనుమతి 2024 జూన్‌లో వచ్చాయని ఆయన శనివారం మీడియాకు విడుదల చేసిన వివరణలో తెలిపారు. నిబంధనలు ఉల్లఘించలేదని, వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందిలేకుండా విక్రయాలు చేస్తామని తెలిపారు.

NOTICE
IN THE COURT OF THE II ADDL.DIST. JUDGE:: GUNTUR
M.V.O.P.No: 873/ 2021

Between:
Mithikayala Chandramma & Others ..... Petitioners
And
Singh and Others ... Respondents

To,
R-1: Singh,S/o. Lal Singh,R/o. Vill-Beda Kapuramaina Basai, Morena, Madhya Pradesh -476001 (Driver Of The Lorry Bearing No. RJ 11 GB 1521)
R-2: Lal Singh,S/o. Pyare Singh, R/o. T/A-Bari Road, Bholpur Raj P/A Beda, Kapuramanina Basai, Morena, Madhya Pradesh-476001 (Owner Of The Lorry Bearing No. RJ 11 GB 1521)

పై నెంబరు O.P లోని పిటీషనర్లు యాక్షిడెంటుకు నష్టపరిహారము కోరుచూ పిటీషన్ దాఖలు చేయగా సదరు O.P. లో 1 & 2 వ రెస్పాండెంట్లు అయిన మీకు కోర్టు నోటీసులు పంపించినను ముట్టనందున ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియ జేయమని ది: 30-09-2024 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ.గం. 10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:30-09-2024

కె.రామకృష్ణా రెడ్డి,
పిటీషనర్లు తరపు అడ్వకేట్, గుంటూరు.

NOTICE
IN THE COURT OF THE ADDL.CIVIL JUDGE (SENIOR DIVISION):: TENALI
I.P.No.11/2023

Between:
Jonnala Prabhavathi ....Petitioner
And
JU Agri Science Pvt Ltd,and Others .... Respondents

To,
R-4: SDS Ramadas Crop Sciences PVt. Ltd., B.O. C/o. Ajay Gupta, 34/2, New palosia, Guntur Town & District-522001

పై నెంబరు ఐ.పి నుండి పిటీషనరు తనను ఇన్ సాల్వెంటుగా డిక్లేర్ చేయమని దాఖలు చేయగా సదరు పిటీషనులో 4వ రెస్పాండెంటు అయిన మీకు పై కోర్టు వారి నుండి నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు నోటీసును ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది.27-09-2024కి వేసినారు.కావున వాయిదా రోజు ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయంగా గాని, లేదా మీ ప్లీడరు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు.లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షమందు విచారణ జరిపి తీర్మానించబడును.

వాయిదా తేది:27-09-2024

వి.బి.సుమంత్,
పిటీషనరు తరపు అడ్వకేట్,
గుంటూరు.

చెక్‌పోస్ట్ వద్ద గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - దాచేపల్లి


దాచేపల్లి మండలంలోని పొందుగుల గ్రామంలో పొందుగుల ఆంధ్ర తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న గంజాయిని దాచేపల్లి పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాదు నుంచి నెల్లూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సులోని వ్యక్తి వద్ద ఉన్న కేజీ 700 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. నిందితుడు కొమ్మలపాటి శారన్ కుమారుని అదుపులో తీసుకొని కేసు నమోదు చేశామని సీఐ వెంకటరావు తెలిపారు. అతని వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నామని , పట్టుబడ్డ గంజాయి సుమారు లక్షల విలువ ఉంటుందని సీఐ తెలిపారు. గంజాయ్ అమ్మడం తరలించడం నేరమని అలా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం తెలిపారు. కార్యక్రమంలో దాచేపల్లి ఎస్ఐ నాగరాజు కానిస్టేబుళ్ల తదితరులు పాల్గొన్నారు.



వర్సిటీ హాస్టల్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ హాస్టల్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు సంఘ నాయకులు తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా .భాను ప్రసాద్, సలహాదారులుగా ఎన్ ప్రసాద్, బి శ్రీనివాసరావు, అధ్యక్షులుగా ఎం విజయబాబు, కార్యదర్శిగా ఎస్ సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా ఎన్ రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా ఎన్ రాంబాబు, ప్రమీలరాణి, 9 కోశాధికారి ఎం ప్రసాద్ సహా12 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. సందర్భంగా జరిగిన జనరల్ బాడీ సమావేశంలో కార్మిక, ఉద్యోగ నేత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



సిఎంకు చెక్కు అందచేస్తున్న చుండూరి మధుసూదనరావు

ప్రముఖ ఆడిటర్ రూ.10 లక్షల విరాళం

ప్రజాశక్తి-గుంటూరు : ఇటీవల సంభవించిన వరదల కారణంగా సర్వం కోల్పోయిన విజయవాడ వరద బాధితులను ఆదుకోవటానికి గుంటూరుకు చెందిన ప్రముఖ ఆడిటర్ చుండూరి మధుసూదనరావు సిఎం సహాయ నిధికి రూ.10 లక్షలు అందజేశారు. విరాళాన్ని శనివారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసి చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మధుసూదనరావును అభినందించారు.



వరద సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులతో సెక్రెటరీ, ప్రిన్సిపాల్ తదితరులు

ఆపదలో చేసే సేవ అమూల్యం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపియస్ కళాశాల, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి విభాగాల నుండి 50 మంది విద్యార్థులు విజయవాడ నగరంలోని వరద బాధితుల సహాయ కార్యక్రమంలో పాల్గొన్నారని కళాశాల సెక్రెటరీ, కరెస్పాండెంట్ కె.వి.బ్రహ్మం తెలియచేశారు. ఇటీవల ఆకస్మికంగా సంభవించిన వరదల కారణం గా ఎంతో నష్టంపోయిన ప్రజలకు సహాయ చర్యలు చేయడం సాటి మనుషులుగా కనీస బాధ్యత మనదని, మానవ సేవే మాధవ సేవ అన్న మహాత్మా గాంధీ మాటలను మరచిపోకూడదన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఇటువంటి సామాజిక కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనడం ఎంతో అభినందనీయమని చెప్పారు. సామాజిక సేవా కార్యక్రమాలలో టిజెపియస్ కళాశాల ఎల్లప్పుడూ ముందు ఉంటుందని కళాశాల అధ్యక్షులు పోలిశెట్టి శ్యాంసుందర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ పి.కష్ణానంద్, కళాశాల కమిటీ సభ్యులు పోలిశెట్టి నాగసుందరం, ప్రిన్సిపాల్ మేజర్ ఏబిపి మనోహర్, జాతీయ సేవా పథకం కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ జె.వి.సుధీర్‌కుమార్, యన్.సి.సి అధికారి మేజర్ పి.కుమార్‌రాజ, ఆర్.జయశైలజ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ప్లాంట్ సీనియర్ జనరల్ మేనేజర్ వి.వెంకట రమణ తదితరులు

కెసిపి సంస్థల ఛైర్ పర్సన్ వెలగపూడి ఇందిరాదత్తు పుట్టినరోజున సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి- మాచర్ల : కెసిపి సంస్థల ఛైర్ పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వెలగపూడి ఇందిరాదత్తు పుట్టినరోజు సందర్భంగా శనివారం స్థానిక కెసిపి సిమెంటు ఫ్యాక్టరీలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కెసిపి సీనియర్ జనరల్ మేనేజర్ (సిపియు) వి.వెంకట రమణ ఆధ్వర్యంలో కెసిపి సంస్థల ఫౌండర్ ఛైర్మన్ వెలగపూడి రామకృష్ణ, కెసిపి సంస్థల ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ వెలగపూడి లక్ష్మణ దత్తుల విగ్రహాలకు ఉద్యోగులు పూలమాలలేసి నివాళులర్పించారు. డాక్టర్ వెలగపూడి ఇందిరాదత్తు పుట్టినరోజును ప్రతిఏటా పర్యావరణ పరిరక్షణ దినోత్సవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్న క్రమంలో కిడ్స్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. సీనియర్ జనరల్ మేనేజర్(సిపియు) వి.వెంకట రమణ మొక్కలు నాటి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణకు, మానవాళి అభివృద్ధికి, కాలుష్య నియంత్రణకు కృషి చేయాలని కోరారు. సమస్థితి మహిళా మండలి కో-ఆర్డినేటర్ వి.సుశీల మొక్కలు నాటి తమ మహిళామండలి సభ్యులందరిచే మొక్కలు నాటించిచారు. సుమారుగా 200 మొక్కలు నాటారు. అనంతరం రమేష్ హస్పటల్స్, గుంటూరు సౌజన్యముతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఫ్యాక్టరీలో పనిచేయు ఉద్యోగులు వారి కుటుంబసభ్యులకు, కిడ్స్ పాఠశాల ఉద్యోగులకు భోజనాలు ఏర్పాటు చేశారు. శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి నిత్య అన్నదాన సత్రంలో అన్నదానం చేశారు. మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ఐఎన్‌టియుసి ద్వారా రోగులకు వండ్లు, బ్రెడ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమములో కె.రామకోటేశ్వరరావు, కె.ఆనందరెడ్డి, బి.శ్రీనివాసరావు, ఎస్.ప్రసాద్, జీవి నాగేశ్వరరావు, శేషంరాజు, అమరలింగచారి ఆల్ హెచ్‌ఒడీస్, ఉద్యోగులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటిన ఇందుకూరి హైమావతి



ప్రజాశక్తి- మాచర్ల రూరల్ : రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో మాచర్ల పట్టణానికి చెందిన ఇందుకూరి హైమావతి సత్తా చాటారు. స్థానిక హనుమాన్ జిమ్‌లో శిక్షణ పొందిన హైమావతి ఈనెల 1వ తేదీన అనకాపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ జూనియర్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించారు. హైమావతిని శనివారం జిమ్ కోచ్‌లు రాచమంటి ఆదివిష్ణుయాదవ్, షేక్ గౌస్ మొహిద్దీన్, సీనియర్ సభ్యులు గోగుల అంజిరెడ్డి, పులుసు రఘునాథరెడ్డి, పోకల వెంకటేశ్వర్లు, గాదె శ్రీనివాసరావు అభినందించారు.

రైళ్లకు హాల్ట్ కోసం ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి - పెదకూరపాడు : రేపల్లె-సికింద్రాబాద్ పాస్టు ప్యాసింజర్, పల్నాడు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు పెదకూరపాడు రైల్వేస్టేషన్‌లో హాల్ట్ కల్పించాలని స్థానికులు ఎమ్మెల్యేకు శనివారం వినతిపత్రం ఇచ్చారు. ట్రెజరీ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపనకు వచ్చిన ఎమ్మెల్యేను అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ, రైతుసంఘం జిల్లా నాయకులు డి.శేషారావు, సిపిఐ నాయకులు ఎం.శ్రీనివాస్, సర్పంచ్ జి.రాజు, టిడిపి నాయకులు ఎ.రమేష్, బి.రామగోపాలరావు, బి.ఆంజనేయులు, వి.అప్పారావు కలిసి వన్నవించారు.



2002లో సుందరయ్య కళా ప్రాంగణం ప్రారంభోత్సవం సందర్భంగా యడ్లపాడులో చేసిన ర్యాలీలో సీతారాం ఏచూరి



గుంటూరులో నివాళులర్పిస్తున్న టింబర్ ముఠా కార్మికులు



ఫిరంగిపురంలో పంచాయతీ కార్మికుల నివాళి

విపత్కర పరిస్థితుల్లో యోధుని మరణం దేశానికే లోటు

సీతారాం ఏచూరికి సిపిఎం, కార్మిక శ్రేణుల ఘన నివాళి - గుంటూరు, పల్నాడు జిల్లాల్లో సంతాప సభలు



మాట్లాడుతున్న ప్రజానాట్య మండలి నాయకులు ఎన్.కాళిదాసు

ప్రజాశక్తి - యడ్లపాడు

ఉద్యమాలకు వేగుచుక్కగా ఉన్న సీతారాం ఏచూరి మరణం దేశ ప్రజానీకానికి తీవ్రమైన లోటని వక్తలు ఆవేదన వెలిబుచ్చారు. స్థానిక పిఆర్ విజ్ఞాన కేంద్రంలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలేసి నివాళులర్పించారు. సభకు ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకులు ఎన్.కాళిదాసు అధ్యక్షత వహించగా సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ మాట్లాడారు. కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఉద్యమాలకు అన్వయించి సిపిఎం చేసిన పోరాటాలకు నాయకత్వం వహించిన సీతారాం ఏచూరి ఆశయాల సాధనకు అందరం కృషి చేద్దామని చెప్పారు. ఎం.విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధ్యయనం చేసి నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా పోరాటం చేసిన ఏచూరి జీవితం భావితరాలకు ఆదర్శనీయమన్నారు. దేవాదాయ శాఖ విశ్రాంత అధికారి పి.గంగయ్య చౌదరి మాట్లాడుతూ ఏచూరి ఆలోచనలను యువతరం ముందుకు తీసుకెళ్లాలన్నారు. నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాల హెచ్‌ఎం పి.సృజన మాట్లాడుతూ చిన్నప్పటి నుండే సిపిఎంపై సీతారాం ఏచూరి ముద్ర ఉందన్నారు. సుందరయ్య స్మారక నాటకోత్సవాల కమిటీ కన్వీనర్ ముత్తవరపు రామారావు మాట్లాడుతూ యడ్లపాడుతో సీతారం ఏచూరికి ప్రత్యేక అనుబంధం ఉందని, పుచ్చలపల్లి సుందరయ్య కళా ప్రాంగణాన్ని 2002లో ఆయనే ప్రారంభించారని గుర్తు చేశారు. సిపిఎంకు చెందిన సాధారణ కార్యకర్త తల్లి మరణిస్తే మండలంలోని లింగారావుపాలేనికి వచ్చి పరామర్శించారని, యడ్లపాడులో జాతీయ రహదారి నిర్మాణంలో నష్టపోతున్న కుటుంబాలకు జాతీయ స్థాయిలో అండగా నిలిచారని తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయులు వై.సాంబశివరావు మాట్లాడుతూ దేశం విపత్కర పరిస్థితుల్లో ఉన్నప్పుడు, ఫాసిస్టు మతతత్వ శక్తులు ఎదుర్కొనేందుకు కమ్యూనిస్టు శక్తులు దిశానిర్దేశం చేసే వ్యక్తి మరణం లోటన్నారు. సభలో సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు, మహిళలు, పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని ఎన్‌జిఒ హోంలో సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఎపి గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.కోటానాయక్, ఎస్సీ, ఎస్టీ బడ్జెట్ వాచ్ కమిటీ నాయకులు ఎం.చిన్నప్ప, ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి రెడ్ బాష, పిడిఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, ఎన్.రామారావు, జి.రామకృష్ణ, సిఐటియు నాయకులు షేక్ సిలార్ మసూద్,



నరసరావుపేటలో నివాళులర్పిస్తున్న వామపక్ష పార్టీలు, అంగన్వాడీ యూనియన్ కార్యకర్తలు, నాయకులు

సిపిఎం నాయకులు షేక్ మస్తాన్‌వలి, సిపిఐ నాయకులు రంగయ్య, వెంకట్, గిరిజన నాయకులు శీను నాయక్ మాట్లాడారు. ఆర్థిక రంగాన్ని విశ్లేషించడంలో దేశంలోనే ఏచూరిని మించినవారు లేరన్నారు. పార్లమెంట్‌లో సోనియా గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ లాంటి వారు కూడా వారి సెషన్ లేనప్పటికీ ఏచూరి ప్రసంగాలు వినేందుకు హాజరైన సందర్భాలున్నాయని అన్నారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) సంతాప సభ మాధవి అధ్యక్షతన నిర్వహించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మల్లేశ్వరి, సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయనాయక్ మాట్లాడారు. సిఐటియు పట్టణ అధ్యక్షులు షేక్ సిలార్ మసూద్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు సాయి, పద్మ, రమణ, కవిత, ధనలక్ష్మి మంగమ్మ, ఫాతిమా, పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఆధునిక భారతదేశ రాజకీయాల్లోనే అజాతశత్రువు సీతారాం ఏచూరి అని, ఆయన మరణం దేశానికే లోటని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. స్థానిక తన నివాసంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అందరూ బావుండాలని, అందర్ని కలుపుకుని పోవాలనే ఆలోచనలతో వామపక్ష ఉద్యమాల్లో ఆయనో కొత్త పంథాను తెచ్చారన్నారు. సైద్ధాంతిక విభేదాలున్న వారితోనూ ప్రజల అవసరాల కోసం కలసి బలమైన పోరాటాలు నిర్మించారని చెప్పారు. ఆయన భౌతికంగా మననుంచి దూరమైనా, వారి పోరాటాలు, సాధించిన విజయాలు, పాటించిన విలువల రూపంలో ఎప్పటికీ మనమధ్యనే ఉంటారన్నారు. ఏచూరి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. విలక్షణ వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి, గొప్ప ఉద్యమకారుడు, నిరంతరం ప్రజల కోసం ఆలోచించే స్ఫూర్తిదాయకమైన వ్యక్తి సీతారాం ఏచూరి అని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ మాదాసు భానుప్రసాద్ ఒ ప్రకటనలో పేర్కొన్నారు.



గుంటూరులో నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

పాతగుంటూరులోని సిఐటియు కార్యాలయంలో ఏచూరి సంస్మరణ సభ టి. శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. చిత్రపటానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ పూలమాలవేసి నివాళులు అర్పించి మాట్లాడారు. ఏచూరి మరణం వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరని లోటన్నారు. మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా, కాలమిస్టుగా, ఆర్థికవేత్తగా బహుముఖ కృషి చేశారని చెప్పారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ, నాయకులు బి.లక్ష్మణరావు, రషీద్, సిహెచ్.శ్రీనివాస్, మురళి, ఎల్.అరుణ పాల్గొన్నారు. జిటి రోడ్డులో టింబర్ ముఠా కార్మికులు సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమానికి టింబర్ ముఠా ప్రెసిడెంట్ జిలాని అధ్యక్షత వహించగా వలి, బాజీ, హసన్, జానీ, బోరాన్‌సాహెబ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : సీతారాం ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లేందుకు సిపిఎం శ్రేణులు మరింత కృషి చేయాలని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి కోరారు. నిడమర్రులో సిపిఎం నాయకులు కె.వెంకటేశ్వర్లు అధ్యక్షతన సంతాస సభ నిర్వహించారు. చిత్రపటానికి సీనియర్ నాయకులు, రిటైర్డ్



నిడమర్రులో

రైల్వే ఉద్యోగి కె.వీరయ్య పూలమాలలేశారు. ఎం.భాగ్యరాజు, జి.నాగేశ్వరరావు, కె.నాగేశ్వరరావు, కె.బుల్లబ్బాయి, ఎం.అంకమ్మరావు, కె.నానయ్య, కె.స్టాలిన్, కె.వీరయ్య, ఎం.రాజముని, మరియదాస్, యు.నాగరాజు పాల్గొన్నారు.



ప్రజాశక్తి -తాడేపల్లి రూరల్ : సీతారాం ఏచూరి చిరస్మరణీయుడని ఆ పార్టీ మండల కార్యదర్శి డి.వెంకటరెడ్డి అన్నారు. వడ్డేశ్వరంలో సీతారాం ఏచూరి సంతాప సభ ఎన్.కిషోర్ బాబు అధ్యక్షతన జరిగింది. చిత్రపటానికి సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు పూలమాలలేశారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో యుపిఎ-1 ప్రభుత్వ ఏర్పాటులో, పేదలకు, వ్యవసాయ కార్మికులకు, గిరిజనులకు, సన్న, చిన్నకారు రైతులకు ఉపయోగపడే అనేక చట్టాలు అమలు అయ్యేందుకు కృషి చేశారని అన్నారు. కుంచనపల్లిలోని నటరాజ కళా మందిరం వద్ద సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి ఎ.రంగారావు అధ్యక్షతన సంతాప సభ జరిగింది. ఏచూరి చిత్రపటానికి రంగారావు, డి.వెంకట్‌రెడ్డి పూలమాలలేశారు. సిపిఐ నాయకులు కె.కాశయ్య, సిపిఎం నాయకులు జి.శ్రీనివాసరావు, ఎ.రామారావు, ఎస్కె గన్, జి.వెంకటేశ్వరరావు, ఎ.రామారావు, కె.యశోద, ఎస్.భీమయ్య, ఎ.ఆదియ, బి.మోహనరావు, బి.శ్రీనివాసరావు, ఎ.శివరామకృష్ణ, ఎన్.మ్యాచ్‌పాల్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి -ఫిరంగిపురం : పంచాయతీ కార్మికుల మండల కమిటీ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి ఎస్ఎం.వలి, శ్యామ్యూల్, అబ్రహం, సతీష్, టి.రమారావు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-తాడేపల్లి : ప్రకాష్‌నగర్‌లో సిఐటియు కార్యాలయం వద్ద సంతాప సభలో సిపిఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, వి.దుర్గారావు మాట్లాడారు. ఎ.శౌరిబర్తులం, ఎన్.దుర్గారావు, వి.శాస్త్రి, ఎమ్మెల నరసింహారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్: వర్కింగ్ ఉమెన్ ఆధ్వర్యంలో చెంచుపేట ప్రజాసంఘాల కార్యాలయంలో నివాళులర్పించారు. ఎవిఎన్ కుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కెబి ప్రసాద్ మాట్లాడారు. బుద్ధిస్ట్ సొసైటీ నాయకులు వై.అశోక్, ఎస్కె హుస్సేన్‌వలి, ఎస్కె హసీనాబేగం, జి.లావణ్య, కె.రాధిక, చంద్రకళ, ఎన్.సుజాత, కె.కనకదుర్గ పాల్గొన్నారు.



నేడు ఇంజినీర్స్ డే



మహా మనిషి మోక్షగుండం విశ్వేశ్వరయ్య

సెప్టెంబరు 15 భారతీయ ఇంజినీర్లందరికీ ఓ పండగరోజు. ప్రఖ్యాత ఇంజినీరు, భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి ఆ రోజునే. ఈయన స్మారకార్థం ప్రతి సంవత్సరం ఆ రోజును ఇంజనీర్స్ డేగా జరుపుకుంటున్నారు. మౌలిక వసతుల కల్పనకు ఇంజనీరింగ్ రంగం ఎంత ప్రధానమైనదో జీవితాంతం కార్యశీలురుగా నిరూపిం చిన మహా మనిషి ఆయన. నైతిక విలువల ఆధారంగా పనిచేసి ఇంజినీరింగ్ రంగానికి విశిష్ట మైన గుర్తింపు, గౌరవం సంపాదించి పెట్టారు. అందుకే ఆ మహనీయుని జన్మదినాన్ని 'ఇంజనీర్స్ డే'గా ప్రభుత్వం ప్రకటించింది. ప్రతి సంవత్సరం ఇంజనీర్స్ డే సందర్భంగా ఈ జాతికి ఆయన చేసిన చిరస్మరణీయ సేవలను మననం చేసుకోవడం ఈతరం ఇంజినీర్లకు, ఇంజనీరింగ్ వృత్తిలో ప్రవేశిస్తున్న లక్షలాది యువతీ యువకులకు ఎంతో స్ఫూర్తిదాయకం...

అతి సామాన్య కుటుంబంలో జన్మించి, అనేక ఒడిదుడుకులలో విద్యనార్జించి, ఉన్నతోన్నత పదవులను అలంకరించి, అద్వితీయ మేధా సంపత్తితో, అకుంటిత దేశభక్తితో, అశేష ప్రజానీకానికి ప్రయోజనకరంగా, వివిధ రంగాలలో భారతదేశ సిరిసంపదలను కీర్తిప్రతిష్టలను పెంపొందించిన మహనీయులల మోక్షగుండం విశ్వేశ్వరయ్య అగ్రగణ్యులు. నూరేండ్లపైబడి జీవించి, సుమారు ఎనిమిది దశాబ్దాల పాటు నిర్విరామకృషి సల్పి, ఆంగ్లేయ పరిపాలనకు గానీ, సంస్థానాధీశులకుగానీ తలవంచనిరీతిలో, తన ప్రత్యేకతలను స్వతంత్ర ప్రతిపత్తిని, ఆత్మాభిమానాన్ని, జాతి గౌరవాన్ని, పరిపోషిస్తూ భారతరత్న బిరుదానికే వన్నెతెచ్చిన, ఆ యశస్వి ఆదర్శ జీవనం ఎంతో స్ఫూర్తిదాయకం.

ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లాలోని మోక్షగుండం అనే గ్రామంలో విశ్వేశ్వరయ్య పూర్వీకులు నివసిస్తూండేవారు. అందువల్ల మోక్షగుండం ఆయన ఇంటి పేరైయింది. కానీ విశ్వేశ్వరయ్య తాతముత్తాతలు మైసూరు రాష్ట్రపు కోలార్ జిల్లాలో నందికొండ సమీపంలోని ముద్ద సహళ్లిలో స్థిరపడ్డారు. అది ఆయన స్వగ్రామమైంది. ఆయన 15 సెప్టెంబరు 1861లో జన్మించారు. కోలార్ జిల్లాలోని చిక్కబళ్లాపూర్‌లో ఒక ప్రాథమికోన్నత పాఠశాలలో చేరి హైస్కూలు స్థాయి వరకు విద్యనభ్యసించారు. విశ్వేశ్వరయ్య బి.ఎ పరీక్షలలో అత్యుత్తమస్థాయిలో ఉత్తీర్ణుడయ్యారు. పూనాలోని సైన్స్ కాలేజీలో ఇంజినీరింగ్ చదివారు. 1883లో తన 23వ ఏట ఎల్‌సియి, ఎఫ్‌సియిఎల్ పరీక్షల్లో బొంబాయి రాష్ట్రంలో ప్రప్రథముడుగా ఉత్తీర్ణుడయ్యారు.

1884 మార్చిలో బొంబాయి ప్రజాపనుల శాఖలో అసిస్టెంట్ ఇంజినీరుగా విశ్వేశ్వరయ్య నియమితులయ్యారు. అనేక ఘన విజయాలతో దేశసేవకు అంకితమైనదిగా ఆయన ఉద్యోగజీవితం ప్రారంభమైంది. నూట రెండేళ్ల ఆరు మాసాల ఎనిమిది రోజులు జీవించిన అనంతరం 1962 ఏప్రిల్ 14వ తేదీ శనివారం ఉదయం 6.15 గంటలకు కన్నుమూశారు. ఎనిమిది దశాబ్దాల సుదీర్ఘకాలం ఆయన దేశానికి చేసిన సేవ అనన్య సామాన్యం. ఆయన తన జీవితంలో ఒక్క క్షణం కూడా వృథా కానీయలేదు. ఆయన అనేక బాధ్యతలు నిర్వహించారు. అందులో ముఖ్యమైనవి ఆటోమేటిక్ స్లూయిస్‌గేట్ నిర్మాణం. ఏడెన్ నగరానికి నీటి సరఫరా, మైసూరు సంస్థానంలో ప్రధాన ఇంజినీర్‌గా, కృష్ణరాజసాగర్ నిర్మాణం, భద్రావతి ఉక్కు కర్మాగారం నిర్మాణం, దేశ ఆర్థికాభివృద్ధికి కృషి, సాంఘిక చైతన్యం, గంగానది వారధి నిర్మాణం, తుంగభద్రా ప్రాజెక్టు నిర్మాణం మొదలైనవి. కీర్తి ప్రతిష్టల కోసం ఆయన ఆశించకపోయినా అనేక ప్రాంతాల నుండి గౌరవ పురస్కారాలు ఆయనకు లభించాయి. 1911లో కంపానియన్ ఆఫ్ ఇండియన్ ఎంపైర్ అనే బిరుదు, 1915లో నైట్ కమాండర్ ఆఫ్ ఇండియన్ ఎంపైర్ అనే బిరుదు, ఎనిమిది భారతీయ విశ్వవిద్యాలయాల గౌరవ పదవులు, పథకాలు మొదలైన అసంఖ్యాక పురస్కారాలు ఆయనకు లభించాయి. 1955లో భారత రాష్ట్రపతి ఈ దేశంలోని ఉత్తమోత్తమమైన 'భారతరత్న' బిరుదుతో సత్క రించారు. విశాఖపట్నం హార్బరు లోపలికి ఓడలు ప్రవేశించే సముద్రపు కయ్యాలో ఇసుక పేరుకొని మార్గానికి ఎదురుగా సముద్రంలో ఒక అడ్డుకట్ట కట్టాలి. సముద్ర మధ్యలో అడ్డుకట్ట నిర్మాణం కష్టసాధ్యమని ఇంజినీర్లు భావించారు. ఆ పరిస్థితిని స్వయంగా పరిశీలించిన విశ్వేశ్వరయ్య అడ్డుకట్ట కట్టాల్సిన చోట రెండు పెద్ద ఓడలను సిమెంటు దిమ్మెలతో ముంచితే ఆ సమస్యకు పరిష్కారం కాగలదని సూచించారు.

శ్రీ విశ్వేశ్వరయ్య సివిల్ ఇంజినీరైనా ఆయన అన్ని రంగాల్లోని భారతీయ ఇంజినీర్లకు ఆదర్శప్రాయుడయ్యారు. ఆయన దూరదృష్టి, దేశభక్తి, దేశ సర్వతోముఖాభివృద్ధికి ఆయన కృషి, పరిశ్రమలు, వ్యవసాయం, విద్య గ్రామీణ ప్రాంత అభివృద్ధి మొదలగు అనేక రంగాల్లో ఈ జాతికి ఆ మహనీయుడు అందించిన సేవలకు భారతజాతి రుణపడి ఉంటుంది. 1960 సెప్టెంబరు 15వ తేదీన యావద్భారత దేశంలోపాటు విదేశాలలో కూడా విశ్వేశ్వరయ్య శతవార్షిక జయంతి ఉత్సవాలు జరిగాయి. భారత ప్రభుత్వం, సర్ ఎం.విశ్వేశ్వరయ్య ఛాయాచిత్రం గల ఒక తపాల బిళ్లను విడుదల చేయడమేకాక, ఆయన సాధించిన ప్రగతి అనేక ప్రముఖ వార్తా పత్రికలు ప్రత్యేక సంచికలు ప్రచురించాయి. అనేక చోట్ల ఆయన విగ్రహాలు ప్రతిష్టించబడ్డాయి. విశ్వేశ్వరయ్యను వేరే ఎవరితోనూ సరిపోల్చలేం. ఆయనకు ఆయనే సాటి. విశ్వవిఖ్యాత ఇంజనీర్‌గా, పాలనాదక్షు డుగా, రాజనీతిజ్ఞుడుగా, నిష్కామ దేశభక్తుడిగా అఖండ కీర్తిని ఆర్జించిన మహనీయుడు ఆయన. మోక్షగుండం విశ్వేశ్వరయ్య గురించి తెలుసుకోవడం అంటే భారతదేశ ఇంజినీరింగ్ రంగ ప్రగతిని తెలుసు కోవడమే...!

నిజాయితీకి నిలువెత్తు రూపం

విశ్వేశ్వరయ్య ఒకసారి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. కొంత డబ్బు కావాల్సి వచ్చింది. మైసూరు బ్యాంక్ మేనేజర్ బి.వి.నారాయణ రెడ్డికి ముందుగా ఫోన్ చేసి, బ్యాంకుకు వెళ్లారు. మేనేజర్ ఆయననెంతో గౌరవంగా లోపలికి తీసుకెళ్లారు. అన్ని దరఖాస్తులు సిద్ధమయ్యాయి. విశ్వేశ్వరయ్య తమ వద్ద ఉన్న భారత ప్రభుత్వ రుణ పత్రాలను ఇచ్చి తాకట్టు పెట్టుకోమన్నారు. మేనేజర్ ఆశ్చర్యంతో 'తాము తాకట్టు పెట్టడమా! ఇది మీరు నెలకొల్పిన బ్యాంక్' అంటూ తిప్పి ఇవ్వగా విశ్వేశ్వరయ్య తీసుకోలేదు. బ్యాంకు వారు తక్కువ వడ్డీ సూచించగా- అందరికీ విధించే వడ్డీ వేయమన్నారు. బ్యాంకు మేనేజర్ వడ్డీ తగ్గించబోయారు. దీంతో ఆయన మండిపడి 'ఏం నేను అందరి మనుషుల్లాంటి వాడిని కానా? నాకు ఎందుకు ఈ తగ్గింపు? ఇలా అయితే నాకు మీ అప్పే అవసరం లేదు. మరొకరి దగ్గరకు వెళతాను' అన్నారు. తన ఉద్యోగ జీవితంలో ఎక్కువ వడ్డీ వేయమని కోరినవారు విశ్వేశ్వర య్య ఒక్కరే అంటూ బ్యాంక్ మేనేజర్ ప్రశంసించారు.

ఎంతో క్రమశిక్షణ

విశ్వేశ్వరయ్య వ్యక్తిగత జీవితం అతి క్రమశిక్షణతో ఉండేది. కాల నియమాన్ని, ఆహార విహార నియమాలను కచ్చితంగా పాటించిన విశ్వేశ్వరయ్య 100 సంవత్సరాల వయస్సులో కూడా కళ్లద్దాలు లేకుండా చదివేవారు. **'గంధపు చెక్క వలె సేవలో అరిగిపో, కాని ఇనుములా తుప్పు పట్టవద్దు' అనేది ఆయన జీవన ధ్యేయం.** దేశ విదేశాలలోని విశ్వవిద్యాలయాలు వారిని సత్కరించాయి. 1961లో విశ్వేశ్వరయ్య శత జయంతి ఉత్సవాలకు భారత ప్రధాని నెహ్రూ విచ్చేశారు. 'మేము మాటలతో కాలయాపన చేశాం. వారు నిరంతర క్రియా శీలురై నవభారత నిర్మాణానికి కృషి చేసిన మహనీయులు' అంటూ నివాళులర్పించారు నెహ్రూ.

భారతరత్న బిరుదు

భారత ప్రభుత్వం విశ్వేశ్వరయ్యని 'భారతరత్న' బిరుదుతో సత్కరించింది. విశ్వేశ్వరయ్య 'ప్లాన్‌డ్ ఎకానమి ఫర్ ఇండియా', 'రికన్‌స్ట్రక్టింగ్ ఇండియా', అన్ ఎంప్లాయ్‌మెంట్ ఇన్ ఇండియా; ఇట్స్ కాజెస్, క్యూర్', 'మెమరీస్ ఆఫ్ మై వర్కింగ్ లైఫ్' (ఆత్మకథ) రచించారు. జీవితాంతం దేశ ప్రగతికి, ప్రజాశ్రేయస్సుకు కృషిచేసిన విశ్వేశ్వరయ్య 1962 ఏప్రిల్14న కన్నుమూశారు.

నాణ్యతా ప్రమాణాలు పెరగాలి

కెఎస్ శ్రీనివాసరావు

కెఎస్ఆర్ అసోసియేట్స్



ఇంజినీరింగ్ విద్యను అభ్యసించి పట్టాలు పుచ్చుకొని బయటకి వస్తున్నవారు లక్షల్లో ఉన్నా వారిలో చాలా మందికి సరైన అవగాహన లేకపోవటంతో ఉపాధి పొందలేకపోతున్నారు. నేటి ఇంజినీరింగ్ విద్యార్థులు మోక్షగుండం గురించి తెలుసుకుని ఆయన చూపిన బాటలో నడవాలి. కాలేజీలో ఉన్నప్పుడే అన్ని విధాల శిక్షణ పొందితే చదువు పూర్తయిన వెంటనే ఉపాధి పొందొచ్చు. ఎక్కువ మంది విద్యార్థులు విద్యా కాలమంతా వృథాగా గడిపి కాలేజి నుండి బయటకు వచ్చాక ఉపాధి కోసం వెతికినా దానికి సరిపోయిన ఉపాధి దొరకదు. నేటి సమాజంలో ఇంజినీరింగ్ పాత్ర గణనీయంగా పెరిగింది. నిర్మాణ రంగంలో గానీ టెక్నాలజి రంగంలో గానీ అన్ని రకాల ఇంజినీరింగ్ టెక్నాలజీ నేడు ప్రజా జీవనాన్ని పెనవేసుకుని ఉంది. ప్రతిరోజూ ఏదో ఒక కొత్త టెక్నాలజీలు అవిష్కృతమవుతున్నాయి. విద్యార్థులు మన దేశంలోని అనేక సమస్యలకు కొత్త టెక్నాలజీ, ఆవిష్కరణల ద్వారా సమాజానికి సేవ చేయడమే మోక్షంగుండం విశ్వేశ్వరయ్యకు వారసులుగా నిలబడగలగడం.

మహామేధావి మోక్షగుండం విశ్వేశ్వరయ్య

తిరుమలశెట్టి సుధీర్


ప్రెసిడెంట్, లైసెన్డ్ ఇంజినీర్స్ అసోసియేషన్ గుంటూరు జిల్లా.



సెప్టెంబర్ 15వ తేదీన సర్ మోక్షగుండం విశ్వేశ్వర్య జయంతిని పురస్కరించుకుని భారత దేశంలో ఇంజినీర్స్ డే వైభవంగా నిర్వహించుకుంటారు. విశ్వేశ్వరయ్య అనేక నీటి స్టోరేజీ అక్విడెక్టులు, డ్యాముల నిర్మాణం చేపట్టి తిరుగులేని మహా మేధావిగా, ప్రపంచం మెచ్చిన ఇంజినీరుగా పేరు ప్రఖ్యాతులు గావించారు. ఆయన పర్యవేక్షణలో కావేరీ నదిపై నిర్మితమైన కృష్ణాసాగర్ డ్యామ్, బాంబేలోని పలు డ్యాములు నేటికీ మానవ నిర్మిత సాక్ష్యాలుగా చెక్కు చెదరకుండా పని చేస్తున్నాయి. ప్రతి అణువులోనూ నాడు, నేడు, రేపు సాంకేతిక పరిజ్ఞానమే కావాల్సి వస్తుంది కాబట్టి ప్రతి ఇంజినీరుకూ ప్రతి రంగంలో ప్రాముఖ్యత ఉంది. మానవ నిర్మితమైన కట్టడాలు శిథిలావస్థకు చేరుకొన్నవి చాలా ఉన్నాయి. ప్రజలు కూడా వీటి పరిరక్షణకు నడుంబిగించాలి. ప్రజలు, అధికారులు, అన్ని రంగాల్లోని ప్రముఖులు పర్యావరణ పరిరక్షణకు కనీస జాగ్రత్తలు పాటించాలి. ఈ భూమి మానవునికి కావాల్సిన సమస్త అవరాల్నీ సమకూరుస్తోంది. ఇందులో ఒక ఉదాహరణను పరిశీలిస్తే మనుగుడకు ప్రాణాధారమైన నీరు, విద్యుత్ ఉత్పత్తికి కావాల్సిన బొగ్గు, వాహనాలకు అవసరమైన ఇంధన, దేశ ఆర్థిక సమతుల్యతకు అవసరమైన బంగారం.. ఇలా ఎన్నింటినో భూమి అందిస్తోంది. కూర్చుని తింటే కొండలైనా కరుగుతాయి. మన నిర్లక్ష్యం మన భవిష్యత్ తరాల వారికి 'చేతిలో చిప్ప' పెడుతుంది. భూమి మనకిచ్చే నీటిని జాగ్రత్తగా వాడు కోవడం మన కింకర్తవ్యం కావాలి. ప్రకృతి మనకిచ్చే నీటిని జాగ్రత్త చేద్దాం.. ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి పంపుదాం.. జాతీయ రహదారులు, ఇతర రహదారుల విస్తరణ పేరుతో చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికేస్తున్నారు. ప్రజలు ఈ చెట్ల కోసం ఆందోళనలు చేయాలి. సౌకర్యాలు మెరుగు పర్చుకుంటూనే పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి. నీటి వృథాను పూర్తిగా అరికట్టాలి. ఇందుకు కొన్ని కఠిన నిబంధనలు, స్వీయ క్రమశిక్షణ పాటించాలి. అందుకు ఈ క్షణం నుండే నడుం బిగించాలి.

ఇంజినీరింగ్ విద్య ఎంతో ఉత్తమం

కెఎస్ఆర్ కుటుంబరావు, ఛార్టెడ్ ఇంజినీర్, గుంటూరు



నేటి ప్రపంచంలో ఇంజినీరింగ్ విద్య అత్యున్నతమైనదిగా రాణిస్తోంది. ఇతర రంగాల విద్య కంటే కూడా ఎక్కువమంది మేధావి వర్గ విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యను ఎంచుకుంటున్నారు. ఐఐటిఎస్, ఎఐటిఎస్ యూనివర్శిటీల విద్యార్థులు ఎంఐటి లాంటి అకౌంట్స్, పొలిటికల్, ఫైనాన్స్, బ్యాంకింగ్, అంతరిక్ష ప్రయోగాలు, ప్రకృతి వైపరీత్యాలు లాంటి వాటిని పుక్కిటపట్టి అత్యద్భుతంగా సమాజానికి, దేశానికి ప్రపంచానికి సహాయం ఉంటున్నారు. ఒక చిన్న 'చిప్'తోనే ఒక వ్యక్తి రోగనిర్ధారణ, ముందు జాగ్రత్తలు తెలియజేసే స్థితికి ఈ విద్య చేరింది.

ఎలక్ట్రానిక్ యుగంలో మనిషి ఏ పనినైనా ఇంటి నుండే చేయగలగడం ఇంజినీరింగ్ విద్య గొప్పదనం. ఇరిగేషన్, ఆర్ అండ్ బి ద్వారా ప్రజలకు కావాల్సిన కూడు, గూడు గుడ్డ ఇస్తున్నది. విద్యుత్, ఎలాక్ట్రానిక్స్, కంప్యూటర్ విద్య వల్ల ఆధునిక పథకాల అమలు నిస్ప క్షపాతంగా చేయగలు గుతున్నాం. ఇలాంటి ఫలితాలు ముందే ఊహించి మనకు ఆధునిక ఆలయాలను అందించిన మేధావి మోక్షగుండం విశ్వేశ్వరయ్య. ఆయనకు హృదయపూర్వక నమస్కారాలు. భావి ఇంజినీర్లు నూతన ఆవిష్కరణపట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలి.



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

మాచర్ల మండల న్యాయసేవా కమిటి ఆధ్వర్యంలో మాచర్ల కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 75 కేసులు పరిష్కారమయ్యాయి. అదాలత్ బెంచి సభ్యులుగా నర్సరావుపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఆర్.ఆశీర్వాదంపాల్, న్యాయవాది వై.రమేష్ బాబులు వ్యవహరించారు. పరిష్కారమైన 75 కేసుల విలువ రూ.59 లక్షలా 54 వేలు ఉంటుంది. ఇందులో క్రిమినల్ కేసులు 55, భరణం కేసు 1, ప్రామిసరీ నోటు కేసులు 12, ఈపి కేసు 1, బ్యాంకు కేసు 1, చెక్కు కేసులు ఐదు ఉన్నాయి. లోక్ అదాలత్‌లో సీనియర్ న్యాయవాదులు గట్ల సత్యనారాయణరెడ్డి, సిహెచ్. నాగిరెడ్డి, వై. కృష్ణమూర్తి, కేళం శ్రీనివాసరావు, జల్లా నాగేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి నాలుగు న్యాయస్థానాల పరిధిలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అందాలత్‌లో 156 కేసులు పరిష్కారమయ్యాయి. ఒకటోవ బెంచ్‌కు సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ సిహెచ్.నాగ వెంకట శ్రీనివాసరావు న్యాయమూర్తిగా లోక్ అదాలత్ మెంబర్‌గా ఆకుల నాగార్జున వ్యవహరించారు. సివిల్, క్రిమినల్ కేసులు మొత్తం కలిపి 156 కేసులు పరిష్కారం కాగా రూ.కోటీ 67లక్షలా 34వేలా 664 ఆర్థిక లావాదేవీలు పరిష్కారం లభించింది. లోక్ అదాలత్‌లో కక్షిదారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

టిడిపి గ్రామ అధ్యక్షురాలిపై ఎఫ్ఐఆర్

ప్రజాశక్తి-తాడేపల్లి

పెనుమాక తెలుగు మహిళ గ్రామ అధ్యక్షురాలు కోట స్వర్ణలతపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఎఫ్ఐఆర్ నమోదయ్యింది. తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు నెమలికంటి అనూష ఫిర్యాదు మేరకు తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి అనూష మాట్లాడుతూ స్వర్ణలత, ఆమె భర్త స్టాలిన్‌తో పాటు కుటుంబ సభ్యులు పృథ్వీ, మాణిక్యరావు, ప్రవీణ్, పవన్ తదితరులు అసభ్య పదజాలంతో తనను తిట్టడమే కాక రహస్య ప్రదేశాల్లో తన మీద దాడి చేసి నెట్టివేశారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. దీనిపై తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండువేల మందికి అన్నదానం

ప్రజాశక్తి - తాడేపల్లి

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా తాడేపల్లి బోసుబొమ్మ సెంటర్ సిపిఎం రోడ్డులో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద శనివారం రెండు వేల మందికి అన్నదానం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్టు నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు ప్రారంభించారు. పండుగల విశిష్టతను, ప్రాముఖ్యతను తెలియజేశారు. కులమతాలకు అతీతంగా ప్రజలందరూ ఐక్యమై పండుగలను జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.కిరణ్, మిత్ర బృందం పాల్గొన్నారు.



ఘనంగా ఇంజినీర్స్‌డే..

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో బావి ఇంజనీర్ల నూతన ఆవిష్కరణలకు కృషి చేయాలని తిరుమల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవి.నారాయణ అన్నారు. శనివారం నరసరావుపేట మండలంలోని జొన్నలగడ్డ గ్రామ పరిధిలో తిరుమల ఇంజనీరింగ్ కళాశాల ఇంజనీరింగ్ పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164వ జయంతి సందర్భంగా ప్రాంగణంలో గల విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ వైవి.నారాయణ మాట్లాడుతూ నేటితరం ఇంజనీర్ల సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ మాట్లాడుతూ లాభాపేక్ష లేకుండా దేశ ప్రగతిని కోరి సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆనకట్టలను నిర్మించారని ఆయన జీవితాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



మోక్షగుండం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ వైవి.నారాయణ



ఉప్పరపాలెం గ్రామంలో..

పోషకాహార విలువలు తెలుసుకోవాలి

ప్రజాశక్తి - వినుకొండ

పోషకాహార విలువలను గర్భిణీలు, తల్లులు, తెలుసుకోవాలని మాసోత్సవాల సందర్భంగా ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారులు తెలియజేశారు. మండలంలోని దొండపాడు అంగన్వాడి సెంటర్‌లో కొత్తపాలెం సెక్టర్ల పోషకాహార మాసోత్సవాలను శనివారం నిర్వహించారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ వినుకొండ సిడిపిఒ ఎం.అనురాధ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మునగాకు ఆకుకూరలు చిరుధాన్యాలు పోషకాహార విలువలు గురించి గర్భిణులు బాలింతలకు, కిశోర బాలికలకు వివరించారు. ముఖ్య అతిథిగా ఐసిడిఎస్ సూపర్వైజర్ జి.శేషకుమారి స్కూల్ హెచ్ఎం జెవి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మధు కోటేశ్వరరావు, ఎఎన్ఎం రత్నకుమారి, ఆశాలు, అంగన్వాడీలు కార్యకర్తలు వై.కృష్ణకుమారి, టి.జ్యోతి, ఎం.గురవమ్మ, ఆయమ్మలు పాల్గొన్నారు.

వినుకొండ ప్రాజెక్ట్ సిడిపిఓ ఎం.అనురాధ ఆధ్వర్యంలో వినుకొండ మండలంలోని నరగాయపాలెం సెక్టార్ పరిధిలోని ఉప్పరపాలెం గ్రామంలో ర్యాలీ నిర్వహించి తల్లులతో గ్రామ కూడలిలో మానవహారం చేపట్టారు. సూపర్వైజర్ ఎం.నాగరాజుకుమారి అంగన్వాడీ టీచర్లు టి.సుజాత, కె.ఆరోగ్యం, ఎఎన్ఎం అంజలి, ఎం.సామ్రాజ్యం, ఆశాలు ఎం.శ్రీదేవి, వై.శైలజ, డి.లీలావతి పాల్గొన్నారు.

విద్యానగర్ అంగన్వాడీ కేంద్రంలో మాసోత్సవాలను సూపర్‌వైజర్ కె.శ్రీలత అధ్యక్షతన నిర్వహించారు. ర్యాలీ అనంతరం అంగన్వాడి కార్యకర్తలు మానవహారంగా ఏర్పడ్డారు. అంగన్వాడీ కార్యకర్తలు పివి గాయత్రి, సునీత, సుధారాణి ప్రసూనాంబ కేజే జ్యోతి, అరుణకుమారి పాల్గొన్నారు.

జెవిఎన్.రామకృష్ణ శాస్త్రికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ప్రజాశక్తి- మాచర్ల

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ నెల 5న నిర్వహించాల్సిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదానోత్సవాన్ని ఎపి.ఎంఇడి ప్రాస్పరిటి అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో విజయవాడలోని వైవి.రావు సిద్దార్థ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆడిటోరియం ఆవరణలో శనివారం నిర్వహించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు ప్రధానోత్సవం డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ దేవానంద రెడ్డి చేతుల మీదుగా మాచర్ల కిడ్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెవిఎన్.రామకృష్ణ శాస్త్రి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం రిజిస్ట్రర్ శ్రీహరి బాబు, సెయింట్ జోసెఫ్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ టి.స్వరూప రాణి, బిఓఎస్.కృష్ణ యూనివర్సిటీ వివి.శైలజ, ముఖ్య అతిథులుగా పాల్గొని ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు.



ఇంటెల్ హైస్కూల్లో మొక్కల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి - మేడికొండూరు

మొక్కల పెంపకం వాటి ఉపయోగాలపై మండలంలోని పేరేచర్ల ఇంటెల్ పబ్లిక్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ కోనూరి జయకుమార్ మాట్లాడుతూ మొక్కలు నాటి, వాటిని పరిరక్షించి పెంచి పెద్దవి చేయటం అవసరమని, ప్రతి పిల్లవాడూ తనకు కావాల్సిన ఆక్సిజన్ అందించే ఒక్క చెట్టునైనా పెంచాలని సూచించారు. ప్రిన్సిపల్ కోనూరి అశోకరాణి మాట్లాడుతూ స్కూల్లో ఉన్న రెండువేల మంది విద్యార్థులందరూ మొక్కలు నాటాలని పేర్కొన్నారు. ఎంపిడిఒ ప్రభాకర్, ఇఒపిఆర్‌డి రవికుమార్, గుంటూరు రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ పోతురాజు, ఎంఇఒ అబ్దుల్ సలీం సహకారంతో 2500 మొక్కలను మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం నాటనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. హెచ్ఎం సుకన్య, పిడి షేక్ రన్ను హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





అంగన్వాడీ టీచర్ కన్నుమూత

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండ గ్రామానికి చెందిన అంగన్వాడి టీచర్ కుంచెఆదిలక్ష్మి(52) అనారోగ్యంతో శనివారం కన్నుమూశారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆమె కొద్దిరోజులుగా ఉదర సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ శనివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. ఆమె మృతి వార్త తెలుసుకున్న సిఐటియు తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావులు ఆదిలక్ష్మి భౌతిక కాయాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించి, నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో డ్వాక్రా యానిమేటర్లు చిలువూరు శాంతకుమారి, కొండపల్లి యశోద, నల్లపు శివ పార్వతి, గుంపెన మహాలక్ష్మి, మర్రి లక్ష్మీ ఉన్నారు.

జాతీయ హిందీ భాషా దినోత్సవం

ప్రజాశక్తి - చేబ్రోలు

ఎస్ఎన్‌ప్రభుత్వ జూనియర్ కళాశాల (చేబ్రోలు)లో జాతీయ హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.సుచరిత మాట్లాడుతూ హిందీ భాష గొప్పతనాన్ని , ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. హిందీ అధ్యాపకులు కె సందేశ్ హిందీభాష ప్రాముఖ్యతను తెలియజేశారు. విద్యార్థులకు క్విజ్ కాంపిటీషన్స్ నిర్వహించారు.

మంత్రి నారాయణను కలిసిన ఎమ్మెల్యే కన్నా

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మున్సిపల్ శాఖ మంత్రి పొంగురి నారాయణను సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ శనివారం కలిశారు. విజయవాడలోని మంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే కన్నా, సత్తెనపల్లి మున్సిపాల్టీకి నిధులు విడుదలపై చర్చించారు.

మండాదిలో ప్రత్యేక మెడికల్ క్యాంపులు

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

జ్వరాల బారిన పడిన వెల్దుర్తి మండలం మండాది గ్రామంలో ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ అదుపులోకి తెస్తున్నామని డాక్టర్ శ్రీరాం తెలిపారు. శనివారం గ్రామంలోని ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహించి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా శ్రీరాం మాట్లాడుతూ ప్రస్తుతానికి గ్రామంలో జ్వరాలు అదుపులోకి వచ్చాయన్నారు. ప్రతి ఇంటికి వెళ్ళి సర్వే చేస్తున్నామన్నారు. దోమ తెరలు వాడకం, కాచి వడపోసిన నీటిని తాగాలని గ్రామస్థులకు సూచనలు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక మెడికల్ క్యాంపులో సూపర్‌వైజర్ అలివేలు మంగమ్మ, ఏఎన్ఎం ఆర్.బుజ్జిబాయి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



17న యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు

ప్రజాశక్తి - చేబ్రోలు

ఈనెల 17వ తేదీ సాయంత్రం 4.30. గంటలకు చేబ్రోలులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కన ఉన్న ఉపాధ్యాయ భవన్ యుటిఎఫ్ మండల కార్యాలయంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు–2024 అవార్డు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని యుటిఎఫ్ మండల కమిటీ అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి వై.రమేష్ బాబు, డి.నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని ఉపాధ్యాయులు అందరూ పాల్గొనాలని కోరారు. ఈ సంవత్సరం నుండి లగడపాటి సీతారామయ్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్, నారాకోడూరు, ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ చేబ్రోలు మండల కమిటీల ఆధ్వర్యంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఉపాధ్యాయ పురస్కారాలు ప్రారంభిస్తున్నామని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర రావు, ట్రస్ట్ చైర్మన్ లగడపాటి వేణుగోపాల్ తెలియజేశారు. ఈ కార్యక్రమానికి పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, కృష్ణ గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి సభ్యులు కేఎస్ లక్ష్మణ రావు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల కమిటీ నాయకులు స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కమిటీ



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ మండల కమిటీ నాయకులు

కార్యదర్శులు కే శ్రీనివాసరావు, కె.విజయ రాజు, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం శ్రీరామ్ మూర్తి, జిల్లా కౌన్సిలర్ రత్న శేఖర్ బాబు, చేబ్రోలు హైస్కూల్ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు బాలాజీ పాల్గొన్నారు.

గద్వాల సోమన్న రచనలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - తెనాలి



ప్రముఖ బాల సాహితీవేత్త గద్వాల సోమన్న రచనలు ఆవిష్కరణ శనివారం బోసురోడ్ లోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నిర్వహించారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన ఆయన తెనాలి వచ్చిన సందర్భంగా స్థానిక సాహితీ ప్రియులను కలిశారు. ఈ సందర్భంగా సోమన్న రచించిన మహనీయులు, రాంబాబు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో ప్రముఖ పద్యకవి విష్ణు మొలకల భీమేశ్వర ప్రసాద్, సాహితీవేత్త కొప్పరాజు విజయ సారధి బాబు, సాహితీ బంధువు ఆళ్ళ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

హెచ్ఐవి బాధితులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ వైద్యశాలలోని ఏఆర్టీ సెంటర్లో చికిత్స పొందుతున్న హెచ్ఐవి రోగులకు పౌష్టికాహారం కిట్లను శనివారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం, డిఎస్పీ బి.జనార్ధనరావు పాల్గొని రోగులకు కిట్లు అందజేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి ఎం.భానుమతి, రెడ్ క్రాస్ బందం, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడికి మంత్రి నారా లోకేష్ సాయం

ప్రజాశక్తి మంగళగిరి

రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. మంగళగిరి నియోజకవర్గానికి చెందిన ఇంటర్నేషనల్ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కేళావత్ చరణ్ నాయక్ అస్ట్రేలియా, న్యూజి లాండ్‌లలో జరగనున్న ఇంటర్నేషనల్ ర్యాంకింగ్ షటిల్ బ్యాండ్మింటన్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు మంత్రి నారా లోకేష్ రూ.3 లక్షలు ఆర్థిక సహాయం చేశారు. కేళావత్ చరణ్ నాయక్ అస్ట్రేలియాలో అక్టోబర్ నెల 16 నుంచి 20 వరకు, న్యూజిలాండ్‌లో అక్టోబర్ నెల 23 నుంచి 26 వరకు జరగనున్న ఇంటర్నేషనల్ ర్యాంకింగ్ పోటీల్లో పాల్గొన నున్నారు. ఈ నేపథ్యంలో శనివారం మంత్రి నారా లోకేష్ ను కలిసి రెండు దేశాలలో పాల్గొనడానికి ఆర్థిక సాయం చేయా లని కోరారు. స్పందించిన మంత్రి నారా లోకేష్ ఇంటర్నేషనల్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో పాల్గొనడానికి అవసరమైన ఆర్థిక సాయం అందిస్తామని చరణ్ నాయక్‌కు భరోసా ఇచ్చారు. వెంటనే ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరుతో రూ.3 లక్షలను స్థానిక నాయ కుల ద్వారా చరణ్ నాయక్‌కు అందజేయించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య మాట్లాడుతూ కేళావత్ చరణ్ నాయక్ ఇంటర్నేషనల్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో పాల్గొనడం మంగళగిరి ప్రజలకు గర్వకారణమని అన్నారు. అస్ట్రేలియా, న్యూజిలాండ్ పోటీల్లో రాణించి దేశానికి మంగళగిరికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. గ్రామీణ యువతి, యువకుల్లో నైపుణ్యాలను గుర్తించేందుకు మంత్రి నారా లోకేష్ కీడ్రాపోటీలు నిర్వహి స్తున్నట్లు చెప్పారు. అన్ని రకాల క్రీడలకు అనుకూలంగా ఉండేలా మంగళగిరి, తాడేపల్లిలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మంగళగిరి మండల పార్టీ అధ్యక్షులు తోట పార్థసారథి, మండల ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



రహదారులకు మోక్షమెప్పుడో..?

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి సుందరయ్యనగర్ వాటర్ ట్యాంక్ వద్ద రోడ్లు పాడైపోయాయి. ఎప్పుడో 15 ఏళ్ల క్రితం వేసిన రోడ్లు వర్షం వస్తే చెరువుల్లా మారిపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడే నేతాజీ హైస్కూల్లో వందలాది మంది విద్యార్థులు చదువు అభ్యసిస్తున్నారు. వందలాది కుటుంబాలు నివశిస్తున్నారు. వారంతా రాకపోకలు సాగించే మార్గం ఇదే. వర్షం వస్తే తమ పరిస్థితి అగమ్యగోచారంగా ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. గజానికి ఓ గుంత వెక్కిరిస్తోందని ఆందోళన చెందుతున్నారు. వర్షం కురిసిన వేళ కొత్త వారు ఈ మార్గంలో వస్తే గుంతల్లో పడి కింద పడిపోతున్నారు. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే ఈ రోడ్డును బాగు చేయాలని ఎంటిఎంసి అధికారులు స్థానికులు కోరుతున్నారు.

సిఎం నిధికి మాజీ సైనికులు రూ.3.30 లక్షల విరాళం

ప్రజాశక్తి - పొన్నూరు

విజయవాడ వరదబాధితుల సహాయార్థం పొన్నూరు మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సిఎంఓ ఆఫీసులో సిఎం చంద్రబాబును కలిసి రూ.3.30లక్షలు విరాళాన్ని అందజేసినట్లు ఆ సంఘం అధ్యక్షుడు కెప్టెన్ షేక్ మస్తాన్ శనివారం తెలియజేశారు. బ్రిగేడియర్ ఏపీ సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ వివి.రెడ్డి తన సొంత నగదును వ్యక్తిగతంగా రూ.1.30 లక్షలు సీఎంఆర్అఫ్ కింద చంద్రబాబుకు అందజేశారని తెలియజేశారు. అలాగే కల్నల్ కెఎండి.రావు తన సొంత పైకం రూ.లక్ష సీఎంఆర్ఎఫ్‌కు అందజేసినట్లు షేక్ మస్తాన్ వివరించారు. పొన్నూరు మాజీ సైనికుల సంక్షేమ సంఘం సభ్యులు తమ వంతు సహకారంగా వరద బాధితులకు ఆపన్న హస్తం అందించిన ప్రతి ఒక్కరికి పేరుపేరున ఆయన



కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులోనూ విపత్కరకాలంలో తమ వంతు సహాయం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేజర్ రమేష్, కెప్టెన్ షేక్ రఫీ, వెంకటేశ్వర్లు, షేక్ మాసూమ్ వలి, షేక్ మొహమ్మద్ జాను, శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాలు, సహాయాలు..

ప్రజాశక్తి - మంగళగిరి

వరద బాధితులకు మంగళగిరికి చెందిన ఆరేకటిక రాష్ట్ర సంఘం మాజీ అధ్యక్షులు కె.శివరాం బాబాజీ కుటుంబ సభ్యులు రూ.లక్ష చెక్కును రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు అందజేశారు. మంగళగిరిలో గణేష్ విగ్రహాలను సందర్శించడానికి వచ్చిన సందర్భంగా మంత్రి లోకేష్‌ను కలిసి అందజేసినట్లు కె.శివరాం బాబాజీ శనివారం తెలిపారు. ఈ సహాయానికి మంత్రి కృతజ్ఞతలు తెలియజేశా రన్నారు. మంగళగిరి, రత్నాల చెరువుకు చెందిన దివి పిచ్చయ్య, లక్ష్మిలు రూ.50వేలు చెక్కును రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు అందజేశారు. ఉండవల్లిలోని మంత్రిని కలిసి అందజేశారని ఇందుకుగాను మంత్రి దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారని తెలిపారు. **ప్రజాశక్తి - మంగళగిరి:** రత్నాల చెరువులోని శ్రామిక నగర్లో భారీ వర్షాలకు ముంపునకు గురైన బాధిత కుటుంబాలకు గుంటూరుకి చెందిన అరకు తారకరామా ఆర్గానిక్స్, ఐ సుజాత (అమెరికా) ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో శనివారం నిత్యవసరాల కిట్స్ పంపిణీ చేశారు. 120 బాధిత కుటుంబాలకు ఐదు కిలోల బియ్యంతో పాటు పది రకాల నిత్యవసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్గానిక్స్ అధినేత గరికపాటి రామకృష్ణ మాట్లాడుతూ విజయవాడ బుడమేరు ముంపు బాధితులకు తమ సంస్థ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్నామని ఈ క్రమంలోనే మంగళగిరి శ్రామిక నగర్లో ముంపు గురైన బాధితు కుటుంబాలకూ పంపిణీ చేశామని అన్నారు. విజయవాడ



రూ.లక్ష చెక్కును మంత్రి నారా లోకేష్‌కు అందజేస్తున్న కె.శివరాం బాబాజీ కుటుంబసభ్యులు

వరద బాధితుల సహాయార్థం, ముఖ్యమంత్రి సహాయ నిధికి తాడేపల్లి మండలం నూలకపేటకు చెందిన వనమా కోటేశ్వరరావు విరాళం అందించారు. శనివారం టీడీపీ కార్యా లయం ఎమ్మెస్సెస్ భవన్‌లో నియోజకవర్గ సమన్వ యకర్త నందం అబద్దయ్యకు రూ.50 వేల విరాళాన్ని చెక్కురూపంలో అందజేశారు. ఈ సందర్భంగా వనమా కోటేశ్వరావును నందం అబద్దయ్య అభినం దించారు.

ప్రజాశక్తి - కొల్లిపర :వరద బాధితులకు హార్వెస్ట్ ఇండియా సంస్థ నిత్యవసర సరుకులు పంపిణీ చేసిందని ఆ సంస్థ అధినేత, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి కత్తెర సురేష్ కుమార్ తెలిపారు శని వారం కొల్లిపరమండలంలోని వరద ముంపునకు గురైన కొత్తూరు లంక మునగపల్లి లంక గ్రామాల్లో 500 మంది బాధితులకు నిత్యవసర సరుకులు బియ్యము, కూరగాయలు పంపిణీ చేశారు. సుద్దపల్లి నాగరాజు ఏ.అప్పయ్య చొప్పర బసవయ్య రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

పశుపోషకులకు పశుదాణా పంపిణీ

ప్రజాశక్తి - కొల్లిపర



కొల్లిపర మండల పరిధి లంక గ్రామాలలో వరద ముంపునకు గురై పశుగ్రాసం కోల్పోయిన పశుపోషకులకు తెనాలి శ్రీశైల భక్త సేవా సమితి వారు శనివారం మునగపల్లి లంక, కొత్తూరు లంక, కనిగిరి లంక ఈపూరులంక గ్రామాల్లోని 400 మంది పశుపోషకులకు ఒక్కొక్కరికి 25 కేజీల పశుదాన, రెండు కేజీల బెల్లం, 25 కేజీల మినప పొట్టు, కొల్లిపర ఎంపిడిఓ విజయలక్ష్మి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

21న మాదిగల ఆత్మగౌరవ సభ

ప్రజాశక్తి - తెనాలి

ఈ నెల 21న స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో నిర్వహించే మాదిగల ఆత్మీయ ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్ పిలుపునిచ్చారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో శనివారం ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎస్‌పి నాయకులతో కలిసి సభ పోస్టనర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభకు ముఖ్యఅతిథిగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పాల్గొంటారని తెలిపారు. సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి కూచిపూడి సత్యం మాదిగ, వేమూరి సుధీర్, కె.బోస్ బాబు, ఎ.కరుణ, తబిత, జ్యోతి, ఆహ్వాన కమిటీ సభ్యులు పులివర్తి లక్ష్మయ్య, మేకల సురేష్, ఎడ్లపల్లి అనిల్ కుమార్, సుద్ధపల్లి మురళీధర్, కె.షాలెం రాజు పాల్గొన్నారు.

పిబిఎన్‌లో ఘనంగా హిందీ దినోత్సవం

ప్రజాశక్తి - పొన్నూరు

నిడుబ్రోలు పిబిఎన్ కళాశాలలో జాతీయ హిందీ దినోత్సవం వేడుకను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సభకు కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీకాంత్ అధ్యక్షత వహించారు. కళాశాల హిందీ విభాగం అధిపతి జె .రూయి దాస్ మాట్లాడారు. 1953వ సంవత్సరం సెప్టెంబర్ 14 నుండి అమలులోకి వచ్చిన జాతీయ హిందీ దినోత్సవం ప్రాముఖ్యత, దానిని నేర్చుకునిన జాతీయస్థాయిలో ప్రతిభాపాటవాలను ప్రదర్శించవచ్చని తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రాభావాన్ని చాటేందుకు హిందీ భాష ఎంతో అవసరమని చెప్పారు. ఈ సభకు ముందు కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కె చిత్తరంజన్, రాజనీతి శాస్త్ర విభాగం అధిపతి జి.సాంబయ్య తదితర అధ్యాపకులు ప్రసంగించారు. జాతీయ హిందీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన, వ్యాసరచన, వకత్వ పోటీలలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలు కళాశాల తరఫున బహూకరించారు. కార్యక్రమం లో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

చవితి నవరాత్రి ఉత్సవంలో భజన

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక నాజరుపేట గురవయ్య కాలనీలో చందు చంద్రమౌళి కళాబందం ఆధ్వర్యంలో వినాయక చవితి నవరాత్రులను పురస్కరించుకొని భజన కార్యక్రమం నిర్వహించారు. గణేష్ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో భజన మాస్టర్ రెడ్డి ఉమామహేశ్వరరావు నిర్వహించిన కార్యక్రమంలో ఎ రమేష్, విజయ్, బైరాగి, మధు దేవి, నాగజ్యోతి, వాణి, శారద పాల్గొన్నారు.



బిఎస్ఎన్ఎల్ వైఫై సేవలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల పరిధిలో బిఎస్ఎన్ఎల్ ఫైబర్ టు ది హోం పేరుతో వినియోగదారులకు వైఫై రోమింగ్ సేవలు త్వరలో ప్రారంభించనున్నట్టు జనరల్ మేనేజర్ సప్పవరపు శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరంతరాయంగా ఇంటర్నెట్ సదుపాయాన్ని అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ రోమింగ్ సదుపాయాన్ని కల్పిస్తున్నట్టు తెలిపారు. తక్షణం కనెక్షన్ల కోసం వినియోగదారులు సంబంధించి సేవా కేంద్రాలు, బ్రాండ్ బ్యాండ్ మేనేజర్లను సంప్రదించాలని కోరారు.

కౌలు చెల్లింపులకు నిధుల విడుదల

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని కోసం భూములు ఇచ్చిన అమరావతి రైతులకు పెండింగ్లో ఉన్న వార్షిక కౌలును చెల్లించాలని నిర్ణయించిన ప్రభుత్వానికి రాజధాని అమరావతి ఐక్యకార్యాచరణ సమితి ధన్యవాదాలు తెలిపింది. రైతులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపింది. కౌలు నిమిత్తం ప్రభుత్వం ఓటాన్ ఎకౌంట్లో కేటాయించిన బడ్జెట్ రూ.400 కోట్ల నిధులను సీఆర్డీఏకి విడుదల చేస్తూ శనివారం ఆదేశాలు ఇచ్చిందని రాజధాని రైతు సమీకరణ సమాఖ్య అధ్యక్షులు మాదల శ్రీని వాసు తెలిపారు. త్వరగా రైతుల ఖాతాలో జమచేయాలని ఆయన సిఆర్డిఏ అధికారులకు విజ్ఞప్తి చేశారు.


నూతన కాలేజికి సంబంధించిన పోస్టర్లు విడుదల చేస్తున్న వై.వి.ఆంజనేయులు తదితరులు

మోతడకలో చలపతి నూతన ఫార్మసీ కళాశాల

ప్రజాశక్తి-గుంటూరు

మోతడకలో చలపతి కాలేజి ఆఫ్ ఫార్మసీ నూతన కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరం నుండి బి.ఫార్మసీలో వంద అడ్మిషన్లకు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, రాష్ట్ర ప్రభుత్వం, విశ్వవిద్యాలయం నుండి ఆమోదం వచ్చిందని చలపతి విద్యా సంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు తెలిపారు. శనివారం కళాశాల పోస్టర్లు, ఆమోద పత్రాలను వై.వి.ఆంజనేయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోతడకలో చలపతి కాలేజి ఆఫ్ ఫార్మసీ 65000 చదరపు అడుగుల విస్తీర్ణంలో స్థాపించబడి, అత్యాధునిక ప్రయోగశాలలు, అధునాతన విశ్లేషణాత్మక పరికరాలు, డిజిటల తరగతి గదులు, విస్తృతమైన గ్రాంధాలయం, సువిశాల కాలుష్య రహిత పచ్చని ప్రాంగణంతో ఆహ్లాదకరంగా నిర్మించినట్లు చెప్పారు. నిష్ణాతులైన అధ్యాపకులు, సమగ్ర బస్ సేవలు, ఆధునిక సదుపాయాలతో హాస్టల్ వసతి, క్రీడా సౌకర్యాలతో ఔషధ పరిశోధన, విద్యలో చలపతి కాలేజి ఆఫ్ ఫార్మసీ అత్యుత్తమంగా రూపాంతరం చెందటానికి సిద్ధంగా ఉందని చలపతి విద్యాసంస్థల సెక్రెటరీ వై.సుజిత్‌కుమార్ తెలిపారు. చలపతి ఫార్మసీ కళాశాలలు, ఔషధ విద్యలో కొత్త మార్పులను నెలకొల్పి ఫార్మాస్యూటికల్ రీసెర్చ్, ఇన్నోవేషన్, పరిశ్రమలలో తదుపరి నాయకుల్ని ప్రోత్సహించే విధంగా ఉంటాయన్నారు.

మలినేనిలో జనరేటివ్ ఎఐ హ్యాకథాన్

ప్రజాశక్తి-గుంటూరు



విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు

మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజిలో సిఎస్ఇ మూడో సంవత్సరం విద్యార్థినులకు మేక్‌స్కిల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 36 గంటల 'జనరేటివ్ ఏఐ హ్యాకథాన్' శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి 'అవసరాల' కో ఫౌండర్ అశ్వనీ వేణుగోపాల్, ఈడిసి కన్వీనర్ డాక్టర్ రాధిక సజ్జ, ఆర్‌విఆర్ అండ్ జెసిసిఈ ఎస్‌టిపి ఫౌండేషన్ సిఇఒ డాక్టర్ మహేంద్రవర్మ, ఎంటర్‌ప్రెన్యూర్స్ డాక్టర్ మన్నె భారతి, జ్యూరీ సభ్యులు డాక్టర్ అపర్ణ చాపరాల, డాక్టర్ కార్తీక పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులు తయారు చేసిన ఇన్నోవేటివ్ ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా మలినేని సంస్థల అధినేత డాక్టర్ మలినేని పెరుమాళ్ళు మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకొని రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అప్పారావు, డైరెక్టర్ డి.శ్రీనివాసకుమార్, డాక్టర్ రామస్వామి, ఇతర విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

జెకెసి లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు :జెకెసి కాలేజి వ్యవస్థాపకుల దినోత్సవం సందర్భంగా శనివారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగాలు, మానవతా స్వచ్ఛంద సంస్థ, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్ ప్రారంభించారు. జిజిహెచ్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివరామకృష్ణ, కౌన్సిలర్ యం.సీతారామరెడ్డి ఈ శిబిరాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు, డైరెక్టర్ ఎస్ఆర్‌కె.ప్రసాద్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.గోపిచంద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ డి.రాహుల్, కె.చరణ్‌చౌదరి, ఎల్.అజయ్‌బాబు పాల్గొన్నారు.

టిజెపిఎస్‌లో హరిసర్వోత్తమరావు జయంతి

ప్రజాశక్తి-గుంటూరు: స్థానిక టిజెపిఎస్ కాలేజిలో గ్రంధాలయ విభాగం ఆధ్వర్యంలో శనివారం ప్రముఖ గ్రంధాలయ ఉద్యమకారులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మేజర్ ఏబిపి మనోహర్ పుస్తకం అంటే కదిలే దేవాలయం అని చాటి చెప్పిన హరిసర్వోత్తమరావు ప్రతి గ్రామంలో తప్పనిసరిగా గ్రంధాలయం ఉండాలని, తద్వారా ప్రజలలో నిరక్ష్యరాస్యత తొలగిపోయి అభివృద్ధిలో నడుస్తారని, విద్యావంతుల సమాజం త్వరగా అభివృద్ధి సాదిస్తుందనే భావం ఉన్న గొప్ప వ్యక్తి అని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రందాలయ శాఖాదిపతి బి.సాయికళ, సిబ్బంది నాగమ్మ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

సాయం కోసం రైతుల ఎదురుచూపులు

వీక్షణం

ఉమ్మడి జిల్లాలో గత నెల 31న కురిసిన అతి భారీ వర్షాలు, అనంతరం వచ్చిన వరదలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఖరీఫ్‌కు తొలి విడత పెట్టిన పెట్టుబడులన్నీ నీటి పాలయ్యాయి. ఎకరాకు సగటున రూ. 25 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టిన పెట్టుబడులు వృధాగా పోయాయి.

వర్షాల వల్ల గుంటూరు జిల్లాలో 86 వేల ఎకరాలు, పల్నాడు జిల్లాలో 8 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని అధికారులు అంచనా వేశారు. అయితే పల్నాడు జిల్లాలో దాదాపు 40 వేల ఎకరాల్లో నష్టం జరిగినట్టు తెలిసింది. బాపట్ల జిల్లా పరిధిలో మరో 98 వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ప్రధానంగా మాచవరం, దాచేపల్లి, క్రోసూరు, అచ్చంపేట, అమరావతి మండలాల్లో పత్తి, మిర్చి, వరి, ఉద్యాన పంటలకు నష్టం జరిగినా కొన్ని వివరాల నమోదులో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించినట్టు తెలిసింది. ఈనేపథ్యంలో పల్నాడు జిల్లాకు కేంద్ర బృందం కూడా రాలేదు. గుంటూరు, బాపట్ల జిల్లాల్లో కేంద్ర బృందం పర్యటన మొక్కుబడిగా సాగింది. పెదకాకాని, తెనాలి రూరల్, మంగళగిరి, తాడేపల్లి మండలాల్లో కేంద్ర బృందం పర్యటన జరిగినా రైతులకు తగిన భరోసా ఇవ్వలేదు. పునరావస కేంద్రాలను సందర్శించలేదు. బాధితులను పరామర్శించలేదు. రైతుల తరుపున అధికారులు కూడా కేంద్ర బృందానికి క్షేత్రస్థాయి సమాచారం కూడా వెల్లడించలేకపోయారు. భాషా సమస్య రైతులను వెంటాడింది. జిల్లాలో ఏటా భారీ వర్షాలు రావడం, పంటలు నీట మునగడం పరిపాటిగా జరుగుతున్నా ఈఏడాది దాదాపు 10 రోజుల నుంచి 12 రోజుల పాటు నీటిలోనే పంటలు ఉండిపోయాయి.దీంతో వేలాది ఎకరాల్లో పంటలు ఎందుకు పనికిరాకుండా పోయాయి. 2006లో వచ్చిన వరదల నేపథ్యంలో 2007నుంచి 2015 మధ్య ముంపు నుంచి శాశ్వత పరిష్కారం కోసం డెల్టా పరిధిలో రూ.4 వేల కోట్లతో డెల్టా ఆధునీకీకరణ పనులు చేపట్టినా ముంపు సమస్య మాత్రం ఏటా వెంటాడుతూనే ఉంది. కృష్ణా డెల్టా పరిధిలో కొల్లిమెర్ల వాగు, మేకలవాగు, చేబ్రోలు సైడ్ డ్రైన్, జల్లవాగు డ్రైన్, కొండవాగు అప్పర్ స్ట్రీమ్, గుంటూరు నల్లయ్య మేజర్ డ్రైన్, రేపల్లే మెయిన్ డ్రైన్, తుంగ భద్ర డ్రైన్, నల్లమడ వాగు పంటలను కభళించింది. వ్యవసాయ పంటలు 83 వేల ఎకరాల లో ముంపునకు గురయినట్లు అంచనా వేశామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రధానంగా 75 వేల ఎకరాల్లో వరి పైరు నీటమునిగి ఎందుకు పనికి రాకుండా పోయింది. పెదకాకాని, దుగ్గిరాల, పొన్నూరు ,కాకుమాను, తెనాలి ,కొల్లిపర, వట్టిచెరకూరు, చేబ్రోలు మండలాల్లో భారీ నష్టం జరిగింది.గత నెల 31వ తేదీన కురిసిన అతి భారీ వర్షాలతో పాటు కష్ణ తీర ప్రాంతానికి పెద్ద ఎత్తున వరద కూడా రావటంతో కాలువలు, డ్రెయిన్లు తెగిపోయి నీరంతా పొలాలపై పడింది. చాలా కాలంగా కాలువల నిర్వహణలో పాలకుల లోపభూయిష్ట విధానాల వల్ల భారీ వర్షాలకు నీరు కదలక పది రోజులపాటు పంటలు వరద నీటిలో తేలియాడాయి. పొలాల్లో సగటున మూడు నుంచి ఐదు అడుగుల నీరు పారుతుండటంతో పంటలు పూర్తిగా జలమయం అయ్యాయి. ఉద్యాన పంటలకు కూడా కోలుకోలేని దెబ్బ తగిలింది. ప్రధానంగా పసుపు, అరటి కంద, మునగ, బొప్పాయి, దొండ, తమల పాకు, కూరగాయల తోటలు, పూల తోటలు నీటమునిగాయి. దీంతో చేతికి రావాల్సిన ఉత్పత్తులు నీటిపాలయ్యాయి.కొన్ని ప్రాంతాల్లో పంట పూర్తిగా నాశనం కావడంతో వీటిని తొలగించి మళ్లీ పంట వేయటానికి రైతులకు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈనేపథ్యంలో మళ్లీ పంట వేయడానికి ప్రభుత్వం చేసే సాయం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. వరికి ఎకరాకు రూ.10 వేలు ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. అయితే పెట్టుబడి ఇప్పటికే రూ.25 వేలకు పైగా పెట్టినట్టు రైతులు చెబుతున్నారు. పత్తి, మిర్చి, ఉద్యాన పంటలకు ఎక్కువగా పెట్టుబడి పెట్టినా ఎంత వరకు సాయం అందుతుందనేది ప్రశ్నార్ధకంగా మారింది.

(ఎ.వి.డి.శర్మ)



డిగ్రీలు అందచేస్తున్న సాంబశివరావు తదితరులు

ఘనంగా చిప్స్ స్నాతకోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కాలేజి స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంగళయాతాన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.ఆర్.ఎస్.సాంబశివరావు, ఐపిఎ నేషనల్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ టి.వి.నారాయణ పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విద్యాధర మాట్లాడుతూ వివిధ ఫార్మసీ కంపెనీల ప్లేస్‌మెంట్స్‌లో 98 శాతం విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సాంబశివరావు మాట్లాడుతూ ప్రపంచ ఫార్మా రంగంతో ధీటుగా మన దేశ ఫార్మారంగం అభివృద్ధి చెందుతుందని, గ్లోబల్ ప్రొవైడర్‌గా ఎదుగుతుందన్నారు. ఫార్మరంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలన్నారు. అలాగే ఫార్మసీ విద్యార్థులు ఉన్నత స్థానాలను చేరటానికి దేశంలో ఫార్మకో విజిలెన్స్, ఫార్ములేషన్ డెవలప్‌మెంట్‌లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ప్రొఫెసర్ టి.వి.నారాయణ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ఫార్మసిస్టులు పోషించిన పాత్ర గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం కోర్సు పూర్తి చేసిన వారికి డిగ్రీలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రెటరీ చుక్కపల్లి రమేష్, గద్దె మంగయ్య ప్రసంగించారు.


విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

కెఎల్‌పి పాఠశాలలో హిందీ దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి స్కూల్లో శనివారం హిందీ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, జెకెసి కాలేజి అసిస్టెంట్ ప్రొఫెసర్ సిహెచ్.సునీత మాట్లాడుతూ హిందీ భాష ప్రాధాన్యతను వివరించారు. హిందీ నేర్చుకోవటం ద్వారా దేశంలో హిందీ భాష ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం దక్ష అవార్డ్స్ జరిగాయి. ముందుగా బహుళైచ్ఛిక ప్రశ్నలతో పరీక్ష, దానిలో ప్రతిభ చూపిన వారికి వ్యాసరచన పోటీలు, వాటిలో గెలుపొందిన వారికి కవితల పోటీ, ఈ పోటీల్లో గెలుపొందిన వారిని దక్ష అవార్డుకు ఎంపిక చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు, నృత్యాలు, పాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.రత్తయ్య, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందచేస్తున్న నాయుడు చక్రనాగ్

సులువైన, సరళ భాష హిందీ

ప్రజాశక్తి-గుంటూరు

భారతీయ భాషలన్నింటికీ అనుసంధానమైన 'హిందీ' భాషను విద్యార్థులందరూ అభ్యసించడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ప్రజ్ఞ విద్యాసంస్థల కార్యదర్శి, కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్ పేర్కొన్నారు. స్థానిక నగరంపాలెం ప్రజ్ఞ విద్యాసంస్థలలో హిందీ దివస్ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా చక్రనాగ్ మాట్లాడుతూ మాతభాష తెలుగు, అంతర్జాతీయ అనుసంధాన భాష ఇంగ్లీషుతోపాటు హిందీపై పట్టు సాధించాలని తద్వారా జాతీయంగా అన్ని రాష్ట్రాల భాషలతో పరిచయం ఏర్పడుతుందని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సుమేధాలో హిందీ దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఎన్‌జిజిఓ కాలనీలోని సుమేధా హైస్కూల్లో హిందీ భాష దినోత్సవం నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి హిందీ ప్రాధాన్యతను వివరించారు. జాతీయ భాష అయిన హిందీ దేశంలో మొదటి స్థానంలో, ప్రపచంలో మూడో స్థానంలో ఉందన్నారు. పాఠశాల స్థాయిలోనే ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా హిందీని నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు హిందీ గేయాలు, నృత్య ప్రదర్శనలు చేశారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు